ప్రజాశక్తి

ఆదివారం 11 జూన్ 2023

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

విశాఖ భగభగ

◆ పెరిగిన ఉష్ణోగ్రతలతో జనం ఉక్కిరిబిక్కిరి ◆ తీవ్ర ఉక్కబోతతో అవస్థలు



నిర్మానుష్యంగా ఉన్న జగదాంబ జంక్షన్



గాజువాక రోడ్డులో కానరాని జన సంచారం

ప్రజాశక్తి - గాజువాక, పెందుర్తి

పెరిగిన ఉష్ణోగ్రతలతో విశాఖ మండుతోంది. మూడు రోజులుగా భానుడు భగభగమంటూ తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాడు. పెరిగిన ఎండ వేడిమి, ఉక్కబోతతో జనం ఉక్కిరిబిక్కిరవుతున్నారు. నిరంతరం రద్దీగా ఉండే రామాటాకీస్ జంక్షన్, గురుద్వారా, హనుమంతువాక కూడళ్లు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ నిర్మానుష్యంగా కనిపించాయి. గాజువాకలోని రహదారులన్నీ బోసిపోయాయి. ఎయిర్‌పోర్టు వద్ద 43 డిగ్రీలకు ఉష్ణోగ్రత చేరింది. దీంతో రోడ్డుమీదకు రావడానికి ఎవ్వరూ సాహసించలేదు. పాత గాజువాక, కొత్త గాజువాక, కణితి రోడ్డులో జన సంచారం కరువైంది. జ్యూస్ సెంటర్లు, శీతల పానీయాల దుకాణాలు తప్ప అన్ని షాపులూ, హోటళ్లూ ఖాళీగానే కనిపించాయి. పెందుర్తి, నాయుడు తోట, చిన ముషిడివాడ, వేపగుంట తదితర ప్రాంతాల్లోనూ అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కూలీలు తప్పనిసరి పరిస్థితుల్లో పనులు వాయిదా వేసుకున్నారు.

నేడు అమిత్ షా సభ

ఉత్తరాంధ్ర నుంచి వాహనాల్లో బిజెపి జనసమీకరణ
- విద్రోహ పాలనపై తిరగబడండి : ప్రజలకు వామపక్షాల పిలుపు
నేడు నగరంలో నిరసన ర్యాలీ
- హాజరుకానున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు



అమిత్ షా సభకు సాగుతున్న ఏర్పాట్లు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా ఆదివారం విశాఖలో పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో సాయంత్రం 5 గంటలకు రైల్వే గ్రౌండ్‌లో రాజకీయ సభ నిర్వహించేందుకు బిజెపి శ్రేణులు సన్నాహాలు చేస్తున్నాయి. తొలుత 8న అమిత్ షా పర్యటన ఉంటుందని ప్రకటించిన ఆ పార్టీ జనసమీకరణ సాధ్యం కాదని 11వ తేదీకి షా సభను మార్చిన విషయం తెలిసిందే. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి జనాలను వాహనాలు, ఆటోల్లో తరలించేందుకు పక్కా ప్రణాళికతో ఆ పార్టీ అనుబంధ సంస్థలన్నీ పనిచేస్తున్నాయి. కనీసం 50 వేల మందికి తగ్గకుండా సభ నిర్వహించాలని ఆ పార్టీ విశాఖ శ్రేణులు నిర్ణయించాయి.

బిజెపి పాలనలో విశాఖకు అన్నింటా అన్యాయమే

'బిజెపి దగ్గర విషం తప్ప విషయమేమీ ఉండదు' అన్న తెలంగాణ మంత్రి హరీష్‌రావు తాజా వ్యాఖ్యలు విశాఖ విషయంలో మిగతా 2లో..

వామపక్షాల నిరసన ర్యాలీ ఇలా..

బిజెపి విద్రోహ పాలనపై సిపిఎం, సిపిఐ, ఇతర వామపక్షాలు ఆదివారం ఉదయం 10.30 గంటలకు రైల్వే డిఆర్ఎం కార్యాలయ జంక్షన్ నుంచి ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్దగల మహాకవి గురజాడ విగ్రహం వరకూ నిరసన ర్యాలీ చేపట్టనున్నాయి. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి.సత్యనారాయణమూర్తి ఈ ర్యాలీలో పాల్గొననున్నారు.

ఎపి పీజీ సెట్ ప్రశాంతం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఈ నెల 6 నుంచి 10వ తేదీ వరకు రాష్ట్రంలోని 36 కేంద్రాల్లోనూ, హైదరాబాద్ రీజియన్‌లోని ఒక కేంద్రంలోనూ నిర్వహించిన ఎపి పీజీ సెట్ 2023 విజయవంతంగా ముగిసింది. ఈ పరీక్షకు మొత్తం 30500 మంది అభ్యర్థులకుగాను 88.76 శాతంతో 27073 మంది హాజరయ్యారు. 22 సబ్జెక్టులకు 15 సెషన్స్‌లో నిర్వహించిన ఈ పరీక్షలు విజయవంతంగా ముగిసిన సందర్భంగా చివరి రోజైన శనివారం ఈ పరీక్షల పాస్‌వర్డ్‌ను ఆంధ్ర యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి.కృష్ణమోహన్ విడుదల చేశారు. కార్యక్రమంలో ఎపి పీజీ సెట్ - 2023 కన్వీనర్ సిహెచ్‌విఎస్.భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు బియ్యం పంపిణీ

▶ వార్త 8లో..

ఇవిఎంల పనితీరు పరిశీలన

▶ వార్త 2లో..

16 నుంచి కాంటెక్ ఎక్స్‌పో

▶ వార్త 8లో..

జర్నలిస్టుల సేవలు అభినందనీయం

◆ మంత్రి విడదల రజని ◆ హెల్త్ క్యాంపు ప్రారంభం



మాట్లాడుతున్న మంత్రి రజని

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : సమాజంలో పాత్రికేయుల పాత్ర ఎంతో కీలకమైనదని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని అన్నారు. శనివారం ఉదయం జగదాంబ జంక్షన్ దగ్గర డాల్ఫిన్ డయోగ్నస్టిక్ సెంటర్‌లో అక్రిడిటేషన్ జర్నలిస్టులకు ఉచిత ఆరోగ్య శిబిరాన్ని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, ప్రజాప్రతినిధులతో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్ని కష్టాలు ఉన్నా జర్నలిస్టులు విలువల కోసం పని చేస్తారని, వారి ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని అక్రిడేటెడ్ జర్నలిస్టులందరికీ డాల్ఫిన్ డయోగ్నస్టిక్ సెంటర్‌లో రూ.10 వేలు పైబడి ఖరీదు చేసే 56 రకాల వైద్య పరీక్షలను ఉచితంగా చేస్తున్నట్టు తెలిపారు. పరీక్షల అనంతరం అవసరమయ్యే అత్యవసర చికిత్సను కూడా ఉచితంగానే అందిస్తామన్నారు. ఈ అవకాశాన్ని జర్నలిస్టులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. త్వరలో మరిన్ని నగరాల్లో జర్నలిస్టుల కోసం ఉచిత ఆరోగ్య శిబిరాలు నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున మాట్లాడుతూ జిల్లాలో అక్రిడిటేషన్ కలిగిన 495 మంది జర్నలిస్టులు పూర్తి స్థాయి వైద్య పరీక్షలు చేసుకునేలా ఏర్పాట్లు చేశామన్నారు. అదేవిధంగా తెల్లరేషన్ కార్డు కలిగిన జర్నలిస్టులకు వర్కింగ్ జర్నలిస్ట్ హెల్త్ స్కీమ్‌కు సంబంధించి ఆరోగ్య బీమా మొత్తాన్ని మిగతా 2లో..

ఆహార భద్రతకు ముప్పు వాటిల్లరాదు

◆ భారత ప్రభుత్వ శాస్త్ర సాంకేతిక విభాగం కార్యదర్శి చంద్రశేఖర్
◆ ఘనంగా గీతం 14వ స్నాతకోత్సవం ◆ కోట హరినారాయణ, వాణిశ్రీలకు గౌరవ డాక్టరేట్లు



మాట్లాడుతున్న చంద్రశేఖర్

ప్రజాశక్తి - మధురవాడ

దేశంలో వ్యవసాయ రంగం కుంటుపడి ఆహార భద్రతకు ముప్పు రాకుండా చూసుకోవాలని భారత ప్రభుత్వ శాస్త్ర సాంకేతిక విభాగం కార్యదర్శి చంద్రశేఖర్ అన్నారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం 14వ స్నాతకోత్సవం శనివారం వర్సిటీలో ఘనంగా జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన పట్టభద్రులను ఉద్దేశించి మాట్లాడారు. శాస్త్ర విజ్ఞాన రంగంలో దేశం పురోగమిస్తోందన్నారు. దేశ యువత బాధ్యతగా మెలిగి సరికొత్త ఆలోచనలతో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా మారాలని ఆకాంక్షించారు. సాంకేతిక ప్రగతిపై దృష్టి సారించాలన్నారు. కృత్రిమ మేధ, ఛాట్ జిపిటి వంటివి మానవ మేధస్సును పక్కదారి పట్టించేవిగా ఉండకూడదన్నారు. గీతం ఛాన్స్‌లర్ డాక్టర్ వీరేంద్ర సింగ్ చౌహాన్ అధ్యక్షతన జరిగిన ఈ స్నాతకోత్సవంలో తేజ ఫైటర్ ఎయిర్‌క్రాఫ్ట్ సృష్టికర్త, పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ కోటా హరినారాయణకు విశ్వవిద్యాలయ గౌరవ డాక్టరేట్ (డాక్టర్ ఆఫ్ సైన్స్)ను, ప్రముఖ తెలుగు చలనచిత్ర నటి వాణిశ్రీకి గౌరవ డాక్టరేట్ డిలిట్‌ను అందజేశారు. వర్సిటీ వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ దయానంద సిద్దవట్టం విశ్వవిద్యాలయం వార్షిక నివేదిక సమర్పించారు. గీతంలోని వివిధ కోర్సుల సిలబస్‌లను, బోధన విధానాలను నూతన జాతీయ విద్యా విధానానికి అనుగుణంగా మార్పుచేశామని తెలిపారు. విశ్వవిద్యాలయం అధ్యాపకులు గడిచిన ఏడాదిలో 1900 పరిశోధన పత్రాలను వెలువరించారని, 18 పేటెంట్లను నమోదు చేశారని, 19 కన్సల్టెన్సీ ప్రాజెక్టులు నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం గీతంలో 43 పరిశోధన ప్రాజెక్టులు నిర్వహణలో ఉన్నాయని వెల్లడించారు. ప్రతిభగల విద్యార్థులను ప్రోత్సహించే దిశగా 2022- 23 విద్యా సంవత్సరంలో 4328 మందికి రూ.28.15 కోట్ల మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

నేడు అమిత్ షా సభ

అచ్చుగుద్దినట్టు సరిపోతాయి. వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను నష్టాల దిశగా వెళ్లేలా చేసి నట్టేట ముంచేందుకు కేంద్రంలోని బిజెపి నాటకాలాడుతోంది. గడిచిన తొమ్మిదేళ్ల కాలంలో మోడీ ప్రభుత్వం సాధించిన విజయాలపై ఈ బహిరంగ సభను విశాఖలో ఆదివారం సాయంత్రం బిజెపి ఏర్పాటు చేసింది. ఆంధ్రప్రదేశ్‌లో ఆ పార్టీ బలపడేందుకు విశాఖ, తిరుపతి వంటి ప్రధాన నగరాలను ఎంపిక చేసుకున్న సంగతి తెలిసిందే. 2024 ఎన్నికలు దగ్గరపడుతుండడంతో రాష్ట్రంలోని ప్రధాన రాజకీయ పార్టీలైన తెలుగుదేశం, జనసేన కూడా బిజెపితో కలిసేందుకు తహతహలాడుతున్నాయి. ఇటీవలే ఢిల్లీ వెళ్లి చంద్రబాబు షాను కలవడం రాజకీయ ప్రాధాన్యత సంతరించుకుంది. వైసిపి ఎలాగూ బిజెపితోనే అంటకాగుతున్నట్టే లెక్క. అందుకే ఆ పార్టీలు బిజెపి ద్రోహంపై మాట్లాడటం లేదు. 135 ఏళ్ల చరిత్ర కలిగిన వాల్తేరు రైల్వే డివిజన్‌ను బిజెపి ఎత్తేసి రాయగడ, విజయవాడలో కలిపేసింది. దక్షిణ కోస్తా రైల్వే జోన్‌ను విశాఖ కేంద్రంగా ఇస్తామనే చెబుతున్నారు తప్ప ఒక్క ఇటుక కూడా పేర్చింది లేదు. గతంలో హిందుస్థాన్ జింక్‌ను వేదాంతకు కట్టబెట్టి రూ.వందల కోట్లు కమీషన్లను విశాఖ కేంద్రంగా బిజెపి నేతలు కొట్టేశారు. వందల ఎకరాలు నేడు రియల్ ఎస్టేట్‌గా మారిపోయాయి. జింక్ కోసం భూములిచ్చిన రైతులంతా నిరుపేదలయ్యారు. డ్రెడ్జింగ్ కార్పొరేషన్‌ను బంగాళాఖాతంలో ముంచెయ్యాలని మోడీ ప్రభుత్వం చూడగా విశాఖ ప్రజానీకం, కార్మికవర్గం, సిఐటియు కలసికట్టుగా పోరాడి కాపాడుకున్నాయి. వైజాగ్ పోర్టులోని బెర్తులన్నీ ఒక్కొటొక్కటిగా పిపిపిలోకి వెళ్లిపోతున్నాయి. స్థలాలను విదేశీ కంపెనీలకు కేంద్రం కట్టబెట్టేస్తోంది. ఇలా విశాఖకు ఒక్క మేలూ చేయని బిజెపి ఇక్కడ బహిరంగ సభ పెట్టి తొమ్మిదేళ్ల ఘనతను చెప్పాలనుకోవడం పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది.

ఆహార భద్రతకు ముప్పు వాటిల్లరాదు

ప్రతిభా స్కాలర్‌షిప్‌లను అందజేశామన్నారు. కార్యక్రమంలో గీతం అధ్యక్షులు ఎమ్.శ్రీభరత్, ఉపాధ్యక్షులు ఎమ్.గంగాధరరావు, కార్యదర్శి ఎమ్.భరద్వాజ, రిజిస్ట్రార్ డాక్టర్ డి.గుణశేఖరన్ ప్రొ వైస్-ఛాన్సలర్లు ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు, డాక్టర్ బి.గీతాంజలి, ప్రొఫెసర్ జయశంకర్ వారియర్, వర్సిటీ అకడమిక్ డీన్‌లు పాల్గొన్నారు.

పలువురికి స్నాతకోత్సవ డిగ్రీలు

విశాఖ ప్రాంగణం నుంచి 2022-23 విద్యా సంవత్సరానికి ఇంజినీరింగ్, ఫార్మశీ, ఆర్కిటెక్చర్, లా, ఇంటర్నేషనల్ బిజినెస్, ఎంబిఎ, బిబిఎమ్, బికామ్ వంటి కోర్సులు పూర్తి చేసిన 2769 మంది పట్టభద్రులకు స్నాతకోత్తర డిగ్రీలను, 84 మంది పరిశోధక విద్యార్థులకు డాక్టరేట్లను, అత్యుత్తమ ప్రతిభ కనబరిచినందుకు 72 మంది విద్యార్థులకు బంగారు పతకాలను స్నాతకోత్సవంలో అందజేశారు. ఉత్తమ పరిశోధకునిగా మేనేజ్‌మెంట్ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ సాయి సుధాకర్ అవార్డు అందుకోగా, ఉత్తమ సిద్ధాంత వ్యాసంగా (పిహెచ్‌డి) గీతం ఫార్మశీ నుంచి పరిశోధన జరిపిన డాక్టర్ కె.అరుణ్ అవార్డు అందుకున్నారు.

ఆకట్టుకున్న వాణిశ్రీ ప్రసంగం

స్నాతకోత్సవంలో చలనచిత్ర నటి చేసిన ప్రసంగం విశేషంగా ఆకట్టుకుంది. తమ కుటుంబ ఆర్థిక పరిస్థితుల వల్ల పెద్ద చదువులు చదవాలని ఉన్నా చదవలేక పోయానని, ఆ లోటు పూర్తి చేసుకోవడానికి ఇప్పటికీ ఏదో ఒక పుస్తకాన్ని చదవడం అలవాటు చేసుకున్నానని అమె తెలిపారు. ఎవరు ఎన్ని డిగ్రీలు, పిహెచ్‌డిలు చేసినా జీవితాంతం నిరంతర విద్యార్థిగా ఉండాలని అన్నారు. తన భర్తతో సహా అందరూ తమ ఇంటిలో డాక్టర్‌లే అని ప్రస్తుత గౌరవ డాక్టరేట్‌తో పెద్ద చదువులు చదవకపోయినా తానూ వారి సరసన డాక్టర్‌గా పేరు ముందు జోడించుకునే భాగ్యం దక్కిందన్నారు. తనకు మొక్కలపై ఉన్న ఆసక్తితో వాటి శాస్త్రీయ నామాలను 250కి పైగా గుర్తు పెట్టుకున్నానని, దానికి వృక్షశాస్త్ర గ్రంథాలను చదివానని వెల్లడించారు. ఉమ్మడి కుటుంబంగా కలిసి జీవించడం, మంచి ఆహారపు అలవాట్లు, పక్కవారికి సహాయే పడే గుణం నేటి తరానికి అవసరం అన్నారు. 40 సంవత్సరాల కిందట అప్పటి మంత్రి జలగం వెంగళరావు సూచనతో తెలంగాణాలోని బయన్నగూడెంలో 30 పడకల ఆసుపత్రి, 300 మంది చదువుకునే విధంగా పాఠశాల నిర్మించి ఇచ్చినట్లు ఆమె తెలిపారు.

ఇప్పటికీ వాణిశ్రీ జిల్లా పరిషత్ హైస్కూల్ పేరుతో నడుస్తున్న ఆ పాఠశాల నుంచి ఎందరో వైద్యులు, లాయర్లుగా ఎదిగారని ఆనందం వ్యక్తం చేశారు. తాను చేసిన మంచి పనులే తనకు నేడు గౌరవ డాక్టరేట్‌ను అందుకునే భాగ్యం కల్పించాయన్నారు

భరోసాలేని కౌలు రైతు



ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

విధాన నిర్ణయాల వెనుక సమాజ హితం కానరానప్పుడు, అత్యధిక ప్రజా ప్రయోజనకారిగా అవి లేనప్పుడు, మేలు కంటే కీడు తలపెడుతున్నప్పుడు భేషజాల్లేకుండా పాలకపక్షాలేవైనా వాటిని పునస్సమీక్షించాలి. పొరపాట్లను సరిచేసుకోవాలి. తప్పులను సరిదిద్దుకోవాలి. తానుచేసింది తప్పని తెలిసినా, సరిదిద్దుకోవడానికి ముందుకు రాకపోతే సరిచేసుకోలేని నష్టం ఆ సమాజానికి, వ్యవస్థకు జరుగుతుంది. వ్యవసాయరంగ పరిక్షణకు, ఆ వ్యవసాయమే జీవనాధారం చేసుకొని బతుకుతున్న కౌలు రైతుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలేవీ భరోసా కల్పించే చర్యలు చేపట్టకపోవడంతో వారు రోజురోజుకూ కుంగిపోతున్నారు. 2014 ఎన్నికల ముందు స్వామినాథన్ కమిటీ సిఫార్సులను అమలుచేస్తామని చెప్పిన నరేంద్రమోడీ ప్రభుత్వం తన తొమ్మిదేళ్ల పాలనలో అవి అమలు చేయకపోగా, వ్యవసాయ పెట్టుబడులను రెండింతలు పెంచింది. అధికారంలోకి వస్తే కౌలు రైతులను ఆదుకుంటామని ఎన్నికల్లో హామీ ఇచ్చిన జగన్మోహన్‌రెడ్డి అంతవరకూ ఉన్న పరిమిత హక్కులను సైతం లేకుండా చేశారు. 2019లో తీసుకొచ్చిన పంట సాగుదారుల హక్కు చట్టంతో కౌలురైతుకు జరుగుతున్న నష్టాన్ని ఎపి కౌలు రైతుల సంఘం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తున్నా ప్రభుత్వం మొరటతనాన్ని చూపుతోంది. ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా కక్షగట్టినట్లు కౌలురైతుల పట్ల వ్యవహరిస్తోంది.

2011 కౌలుదారీ చట్టాన్ని కౌలు రైతు నిలదొక్కుకొని సాగుచేసేలా పరిపుష్టి చేయాలని కౌలు రైతు సంఘం 'కౌలు రైతుల రక్షణ యాత్ర' జీపు జాతాను రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తోంది. అందులో భాగంగానే అనకాపల్లి జిల్లాలో ఈ నెల 5, 6 తేదీల్లో కౌలు రైతులున్న ప్రాంతాల్లో ఈ యాత్ర నిర్వహించింది. భూ యజమానుల ఆమోదంతో నిమిత్తం లేకుండా గ్రామ సభ ద్వారా కౌలు రైతులందరికీ పంట సాగుదారు హక్కు పత్రం (సిసిఆర్‌సి) మంజూరు చేయాలని, స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం పంట రుణం, రాయితీపై విత్తనాలు, ఎరువులు కౌలు రైతుకు ఇవ్వాలని, సిసిఆర్‌సితో ఈ - క్రాప్ అప్‌లోడ్ చేయాలని, రైతు భరోసా, ఇన్‌పుట్ సబ్సిడీ వంటివి కౌలు రైతుకు వర్తింపజేయాలన్న న్యాయమైన డిమాండ్లతో కౌలు రైతుల సంఘం అనేక గ్రామాల్లో తిరిగింది.

వాస్తవానికి ప్రభుత్వం భూ యజమానుల ఆమోదం తప్పనిసరి చేయడంతో కౌలు రైతులు గుర్తింపు కార్డులు పొందలేకపోతున్నారు. జిల్లాలో 70 వేల మందికిపైగా కౌలు రైతులున్నప్పటికీ గతేడాది 4115 మందికి సిసిఆర్‌సి మంజూరు చేస్తామని చెప్పి 1201 కార్డులు మంజూరు చేశారు.

ఈ కార్డుల కాలపరిమితి ముగియడంతో ఐదో విడత మొదట దశలో భూ యజమానులకు రైతు భరోసా దబ్బులు జమచేసిన ప్రభుత్వం కౌలురైతుకు ఇవ్వలేదు. పిఎమ్ కిసాన్ కింద కౌలు రైతుకు కేంద్ర ప్రభుత్వం పైసా వేయడంలేదు. వ్యవసాయ రంగ పరిరక్షణ, ఆహార భద్రత కోసం కౌలు రైతులను ఆదుకోవాలని ప్రొఫెసర్ రాధాకృష్ణ రైతు అధ్యయన కమిషన్ సిఫార్సులను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకొని అమలుచేయగలిగితే కౌలురైతుకు కొంతైనా ఉపశమనం కలుగుతుంది.

13న సివిల్స్ విజేత ఆశ్రితకు సన్మానం

ప్రజాశక్తి - విశాఖపట్నం : అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో 2022 సివిల్ సర్వీసెస్ ఫలితాల్లో 315వ ర్యాంకు సాధించిన ఎన్.ఆశ్రితకు అభినందన సభ నిర్వహిస్తున్నట్లు అల్లూరి స్టడీ సర్కిల్ డైరెక్టర్ కె.అభిమన్యు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం ఈ నెల 13వ తేదీన ఉదయం 10 గంటలకు ఉంటుందని పేర్కొన్నారు. సీనియర్ ఐఎఎస్ అధికారులతో సివిల్స్‌కు సన్నద్ధమయ్యే యువతకు ఇంటరాక్టివ్ సెషన్ కూడా కొనసాగింపుగా ఉంటుందన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈ సెమినార్‌ను సద్వినియోగం చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 8008412798 నెంబరును సంప్రదించాలని కోరారు.

జర్నలిస్టుల సేవలు అభినందనీయం

(మొదటి పేజీ తరువాయి..) సిఎస్ఆర్ నిధుల నుంచి చెల్లిస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం 2023-24 సంవత్సరానికి మంజూరు కాబడిన అక్రిడిటేషన్ కార్డులను జర్నలిస్టులకు మంత్రి అందజేశారు. 300 మందికి 'వర్కింగ్ జర్నలిస్ట్ హెల్త్ స్కీమ్'లో భాగంగా బీమా మొత్తం రూ.3 లక్షలా 75 వేలు చెక్కును అందజేశారు. కార్యక్రమంలో మేయర్ గొలగాని హరివెంకట కుమారి, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఎంపీ ఎంవివి.సత్యనారాయణ, గాజువాక శాసనసభ్యులు తిప్పల నాగిరెడ్డి, సమాచార శాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు వి.మణిరామ్ పాల్గొన్నారు.

ఇవిఎంల పనితీరు పరిశీలన

ప్రజాశక్తి - ఆరిలోవ : చినగదిలిలోని ఇవిఎం గోదాములో భద్రపరిచిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లు (ఇవిఎంలు) పని తీరును ఎన్నికల కమిషనర్ ముఖేష్ కుమార్ మీనా జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జునతో కలిసి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం జిల్లా కలెక్టర్ ప్రతి నెలా సీల్డ్ గోదాములను పరిశీలించాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌డిఒలు హుస్సేన్ సాహెబ్, భాస్కర్ రెడ్డి, తహశీల్దార్ రమణయ్య పాల్గొన్నారు.

మతోన్మాదం నుంచి దేశాన్ని రక్షించాలి

ప్రజాశక్తి-సీతమ్మధార: దేశాన్ని మతోన్మాదం నుంచి రక్షించి, దేశ సంపదను కాపాడమే 'భారత బచావో' ముఖ్య ఉద్దేశమని ప్రముఖ కార్డియాలజిస్ట్, భారత్ బచావో జాతీయ కమిటీ వైస్ చైర్మన్ డాక్టర్ ఎంఎఫ్ గోపీనాథ్ తెలిపారు. పౌర గ్రంథాలయంలో శనివారం నిర్వహించిన 'భారత్ బచావో' జిల్లా సదస్సుకు ఆయన ముఖ్య వక్తగా విచ్చేసి ప్రసంగించారు. నేడు హిందూ మతోన్మాదం ప్రమాదకరంగా మారిందన్నారు. ఆర్ఎస్ఎస్, దాని అనుబంధ సంస్థల వల్లనే ఈ ప్రమాదం వచ్చిందని తెలిపారు. భారత ఉపఖండంపై దాడిచేసిన ఆర్యులు ముందుగా సింధు నాగరికతను ధ్వంసం చేశారని తెలిపారు. నాటి ఆర్యులు రాసినవే వేదాలు, ఉపనిషత్తులు, రామాయణ, మహాభారత గ్రంథాలన్నారు. ఆర్యులు రాసిన వాటిలో ఎక్కడ తేడీలు, రచయితల పేర్లు ఉండవన్నారు. ఆర్ఎస్ఎస్ మూలాలు అక్కడి నుంచి వచ్చినవేనని, వీరు దేశంలో హిందూయిజం పేరుతో ప్రజల మధ్య విభేదాలు సృష్టించి, హింసకు పాల్పడి అల్లకల్లోలం సృష్టిస్తారని ఆనాడే పూలే, అంబేద్కర్, స్టాలిన్ హెచ్చరించారని గుర్తు చేశారు. వేదాల్లో పురాణాల్లో ఎక్కడ హిందూ అనే పదమే లేదని, సింధు పదం పలకలేక 11వ శతాబ్దంలో ఓ పర్షియన్ హిందూ అన్నారని తెలిపారు. ఆర్ఎస్ఎస్ ప్రధాన శత్రువులు ముస్లింలు, క్రైస్తవులు, వామపక్షాలు, దళితులు అని పేరొన్నారు. ఆర్ఎస్ఎస్ అనుబంధ సంస్థ బిజెపి అధికారంలోకి వచ్చాక 2014 ముందు, 2014 తర్వాత దేశ పరిస్థితిని సమీక్షించుకోవలసిన అవసరం ప్రజాస్వామ్యవాదులకు ఏర్పడిందన్నారు. బిజెపి, ఆర్ఎస్ఎస్ ప్రజలతో మైండ్ గేమ్ ఆడుతూ దేశ సంపదను అంబానీ, అదాని వంటి కార్పొరేట్లకు కట్టబెడుతోందని విమర్శించారు. ఈ తరుణంలో దేశాన్ని రక్షించుకోవడం కోసం ప్రతి ఒక్కరూ సన్నద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. నిర్వహణ కమిటీ గౌరవాధ్యక్షులు, రైటర్స్ అకాడమీ చైర్మన్ వివి.రమణమూర్తి మాట్లాడుతూ, భారత్ బచావో ఉద్యమానికి మద్దతుగా 42 ప్రజా సంఘాలు ముందుకు వచ్చాయన్నారు. మోడీ పాలనలో పేదల పరిస్థితి మరింత అధ్వానంగా తయారైందన్నారు. ప్రభుత్వ సంస్థలను ఒక్కొక్కటి అమ్మేస్తూ, దేశ సంపదను కొద్ది మంది చేతుల్లో పెడుతున్నారని విమర్శించారు. కేవలం రూ.20వేల కోట్లు అప్పును సాకుగా చూపించి స్టీల్‌ప్లాంట్‌ను కారు చౌకగా అమ్మేసేందుకు నిర్ణయించారని తెలిపారు. ఏమి సాధించారని అమిత్ షా విశాఖలో మీటింగ్ పెడుతున్నారని నిలదీశారు. ఈ కార్యక్రమంలో సావిత్రిబాయి పూలే ట్రస్ట్ ప్రతినిధి గుడూరి సీతామహలక్ష్మి, చైర్మన్ సి.భాస్కరరావు, ఏయూ ప్రొఫెసర్ పీడీ.సత్యపాల్, కమిటీ కార్యదర్శులు దుడ్డు ప్రభాకర్, జివి.రంగారెడ్డి, డాక్టర్ పొన్నాడ శ్రీనివాస్, ఎస్ఆర్ వేమన, బి.కళ్యాణ్‌రావు, పిఒడబ్ల్యు నాయకులు లక్ష్మి, విమల, మహిళా చేతన నాయకులు పద్మ, లలిత, ప్రజాసంఘాల నాయకులు టి.శ్రీరామ్మూర్తి, వై నూకరాజు, రాంప్రభు, మహిళ, దళిత సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అప్పన్న ఆలయానికి భక్తుల రద్దీ

ప్రజాశక్తి-సింహాచలం: అధిక సంఖ్యలో గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో శనివారం సింహాద్రి అప్పన్న ఆలయానికి రద్దీ ఏర్పడింది. భక్తులు స్వామి దర్శనానికి క్యూ లైన్‌లో అధిక సమయం వేచి ఉండాల్సి వచ్చింది. దర్శనం అనంతరం ప్రసాదం కోసం కూడా అధిక సమయం వేచి చూడక తప్పలేదు. అన్నదాన సమయం 12 గంటలకు మార్చడంతో గంటల తరబడి క్యూలైన్లో వేచి ఉండాల్సి వచ్చింది. దీంతో భక్తులు ఉదయం నుంచి క్యూలైన్లో ఉండడంతో కొంత మేర అసహనం వ్యక్తం చేశారు. దీనికి తోడు ఎండ వేడిమికి కొన్ని ప్రదేశాల్లో సరైన నీడ లేక కాలు కాలుతూ భక్తులు ఇబ్బంది పడ్డారు. అధికారులు స్పందించి వెంటనే కార్పెట్లు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

కనకరావు రికార్డు

ప్రజాశక్తి -పిఎం పాలెం : సలంబ శీర్షకోణాసనంలో ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో పెదిరెడ్ల కనకరావు చోటు సంపాదించారు. పిఎం.పాలెం ఆర్.హెచ్ కాలనీలో నివాసముంటూ డ్రాగన్ ఫిట్‌నెస్ సెంటర్‌లో ప్రధాన శిక్షకుడిగా పనిచేస్తున్న కనకరావు పలు రికార్డులను సొంతం చేసుకున్నారు. ఈ ఏడాది మార్చిలో యోగా ఫీట్ ప్రదర్శనలో సుమారు 4 నిమిషాల 25 సెకండ్ల పాటు చేసిన సలంబ శీర్షకోణాసన వీడియో క్లిప్పులను ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌కు పంపించగా, వారు వివరాలు తెలుసుకుని ఇండియాలో యోగ ఫీట్స్‌లో ఆ విధమైన భంగిమలో ఇప్పటివరకు ఎవ్వరూ చెయ్యలేదని నిర్ధారించారు. శనివారం కొరియర్ ద్వారా బంగారు పతకాన్ని, ధ్రువీకరణ పత్రంతో పాటు ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ పుస్తకాన్ని పంపించినట్లు కనకరావు తెలిపారు. ఈ పతకం సాధించిన పెదిరెడ్ల కనకరావును కుటుంబ సభ్యులు, స్థానికులు, విద్యార్థులు అభినందించారు. రానున్న రోజుల్లో గిన్నిస్ బుక్‌లో చోటు సంపాదించడమే తన లక్ష్యమని ఈ సందర్భంగా తెలిపారు.

12 నుంచి గురుకులాల్లో ప్రవేశాలు

ప్రజాశక్తి- భీమునిపట్నం : ఎంపికైన విద్యార్థులు ఈ నెల12వ తేదీ నుంచి గురుకులాల్లో ప్రవేశం పొందవచ్చని స్థానిక ఎపి బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ కోడి రాంబాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జూనియర్, డిగ్రీ కళాశాలలో ప్రవేశానికి అర్హులైన విద్యార్థులను 1:3 నిష్పత్తి ప్రకారం 12 నుంచి 15వ తేదీ వరకు ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో కౌన్సిలింగ్ నిర్వహించి కళాశాలలను కేటాయించనున్నట్లు పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులకు ఎస్ఎంఎస్ ద్వారా ఈ నెల 9వ తేదీ లోపు సమాచారం పంపిస్తామని తెలిపారు.

12వ వార్డులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



భూమిపూజ చేస్తున్న మేయర్ హరి వెంకటకుమారి, అక్కరమాని విజయనిర్మల

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి 12వ వార్డు పరిధి కనకదుర్గానగర్, రాజేంద్రనగర్, దుర్గానగర్ తదితర ప్రాంతాల్లో సిసి కాలువల నిర్మాణానికి మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, తూర్పు నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త అక్కరమాని విజయ నిర్మల, వార్డు కార్పొరేటర్ అక్కరమాని రోహిణితో కలిసి శనివారం శంకుస్థాపన చేశారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా రూ.20 లక్షల వ్యయంతో ఈ పనులు చేపట్టనున్నారు. ఈ సందర్భంగా మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, అక్కరమాని విజయ నిర్మల మాట్లాడుతూ, అన్ని వార్డుల్లో మౌలిక వసతుల కల్పనకు జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందన్నారు. వార్డు కార్పొరేటర్ అక్కరమాని రోహిణి విన్నపం మేరకు ఇప్పటికే వార్డులో అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సహాయ ఇంజినీరు అప్పాజీ, వైసిపి నాయకులు సత్తి మందారెడ్డి, పిఎ బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

రెగ్యులర్ చేయాలని వినతి

ప్రజాశక్తి-మధురవాడ : తమను రెగ్యులర్ చేయాలని కోరుతూ శనివారం విశాఖలో పర్యటించిన మంత్రి విడదల రజనికి వైద్య ఆరోగ్యశాఖ టీబీ డిపార్ట్‌మెంట్‌లో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న ఉద్యోగులు వినతిపత్రం అందించారు. ఒకరి నుంచి ఒకరికి ఈ వ్యాధి అంటుతుందని తెలిసినా కూడా ఇల్లు గడవడం కోసం ఉద్యోగాలు చేస్తున్నామని, ఈ వ్యాధి సోకి పలువురు ఉద్యోగులు మృతిచెందారని వివరించారు. 20 ఏళ్లగా చేస్తున్న తమను రెగ్యులర్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా టీబీ యూనియన్ నాయకులు గోపి, వీరబ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.



మంత్రి రజనికి సమస్యలు వివరిస్తున్న టీబీ విభాగ కాంట్రాక్టు ఉద్యోగులు

ఘాట్ రోడ్డులో మొరాయిస్తున్న ఆర్‌టిసి బస్సులు



ఘాట్ రోడ్డులో నిలిచిన ఆర్‌టిసి బస్సు

ప్రజాశక్తి-సింహాచలం: భక్తుల రద్దీ సమయంలో కూడా కండిషన్ లేని ఆర్‌టిసి బస్సులు వేయడంతో సింహాచలం ఘాట్ రోడ్డులో శనివారం 60వ నెంబర్ బస్సు మొరాయించింది. శనివారం భక్తులు అధిక సంఖ్యలో కార్లు, బైకులపై తరలి రావడంతోపాటు సింహగిరిపై అడ్డదిడ్డంగా వాహనాలు పార్కింగ్ చేయడంతో ట్రాఫిక్ స్తంభించింది. దీంతో ఎన్‌టిఆర్ ఘాట్ వరకు ట్రాఫిక్ స్తంభించింది. గోపాలపట్నం ట్రాఫిక్ ఎస్ఐ శ్రీనివాసరావు సిబ్బందితో ఘాట్ రోడ్డు చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

అయ్యప్ప దేవాలయ నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని కృష్ణాపురం పంచాయతీలో ఉన్న శ్రీ కన్యకాపరమేశ్వరి ఆలయ ప్రాంగణంలో అయ్యప్ప స్వామి దేవాలయం నిర్మాణానికి శనివారం శంకుస్థాపనచేశారు. అనకాపల్లి శ్రీ వెంకటేశ్వర ఆలయం ప్రధాన అర్చకులు రేజేటి గోపాలచార్య ఆధ్వర్యంలో కేరళలో ఉన్న ఆలయం మాదిరిగా నిర్మించనున్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి 10వ వార్డు సుందర్‌నగర్‌లో సిసి రోడ్లు, కాలువ పనులు పనులను వార్డు కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మీరాజశేఖర్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, పనులను త్వరితగతిన పూర్తి చేసి స్థానికులకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. వార్డు టిడిపి అధ్యక్షులు గాడు అప్పలనాయుడు, కార్యదర్శి కె.సత్యనారాయణ, వి.అప్పారావు, మద్దిల రాజేష్, సంఘం సభ్యులు కనకల రామారావు, లుకలాపు కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

24వ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 24వ వార్డు చైతన్యనగర్, రేసపువానిపాలెంలో శనివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు, వార్డు కార్పొరేటర్ సాడి పద్మారెడ్డితో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ ఫలాలను వివరించారు. ప్రజల సమస్యలనడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కెకె.రాజు మాట్లాడుతూ, ప్రజల జీవన ప్రమాణాలను మెరుగు పరిచే విధంగా సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టి, వాటిని నేరుగా లబ్ధిదారులకు అందజేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జోనల్-3 కమిషనర్ విజయలక్ష్మి, ఎపిడి దుర్గా ప్రసాద్, రాష్ట్ర యాత కార్పొరేషన్ చైర్మన్ పిల్లి సుజాత, సంయుక్త కార్యదర్శి కిరణ్ రాజు, రాయుడు శ్రీను, వార్డు నాయకులు కర్రి మురళీకృష్ణ రెడ్డి, గుడ్ల అశోక్ రెడ్డి, బోగవల్లి గోవింద్, కె.చిన్నా, వెంకటేష్, రాము తదితరులు పాల్గొన్నారు.

బిహెచ్‌పివి ఎస్‌సి, ఎస్‌టి ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి -గాజువాక : బిహెచ్‌పివి ఎస్‌సి, ఎస్‌టి ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికల ఫలితాలు శనివారం రాత్రి ప్రకటించారు. మొత్తం 162 ఓట్లకుగాను, 129 ఓట్లు పోలయ్యాయి. అధ్యక్షులుగా జి.కిరణ్, ప్రధాన కార్యదర్శిగా కె.దేవుడు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా హెచ్.జోగేసి, ఉపాధ్యక్షులుగా జి.ఆదినారాయణ, అసిస్టెంట్ సెక్రెటరీగా డి.సాయిబాబు, ట్రెజరర్‌గా కె.పవన్‌కుమార్ ఎన్నికయ్యారు.

సింహాద్రి అప్పన్నను దర్శించుకున్న ప్రముఖులు

సింహాచలం: సింహాద్రి అప్పన్నను తెలంగాణ రాష్ట్ర గవర్నర్ తమిళ సాయి సౌంధ రాజన్, భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు వేర్వేరుగా దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు స్వాగతం పలికారు. వీరు ముందుగా కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. బేడా మండపం చుట్టూ ప్రదక్షిణం చేశారు. స్వామి అంతరాలయంలోనూ, గోదాదేవి సన్నిధిలోనూ, గోత్రనామాలతో ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం ఆస్థాన మండపంలో అర్చకులు ఆశీర్వదించారు. వారిని ఆలయ అధికారి సిరిపురపు కనకరాజు సత్కరించి, స్వామివారి ప్రసాదాన్ని, చిత్రపటాన్ని అందించారు.

అగ్ని ప్రమాద కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి -ఆనందపురం: ఆనందపురం గ్రామం ఎగువ యాతపేటలో ఈ నెల 8వ తేదీ రాత్రి కొలుసు కృష్ణమ్మ ఇల్లు అగ్ని ప్రమాదంలో దగ్ధం కావడంతో గ్రామ వైసిపి నాయకులు కీర్తిశేషులు మీసాల నర్సునాయుడు సతీమణి మీసాల పైడిరాజు పరామర్శించి రూ.3 వేలు నగదు, ఒక బియ్యం ప్యాకెట్, నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మీసాల పైడిరాజు కుమారుడు మీసాల చాణక్యనాయుడు, లండ రామారావు, కెల్ల శ్రీను, పట్నాల బంగారు నాయుడు, కొన అప్పలనారాయణ, రౌతు గోపి, వి.సింహాచలం, పాండ్రంకి శివ, బంటుపల్లి సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.

వారణాసి ప్రత్యేక రైలు సేవలు పొడిగింపు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : వేసవిలో ప్రయాణికులకు సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందించేందుకు ఈస్ట్ కోస్ట్ రైల్వే విశాఖపట్నం -బెనారస్ - విశాఖపట్నం రైళ్ల సేవలను పొడిగించాలని నిర్ణయించింది. 08588 విశాఖపట్నం - బెనారస్ వీక్లీ స్పెషల్ రైలు జూన్ 21, 28 తేదీలలో మధ్యాహ్నం 12:30 గంటలకు విశాఖలో బయలుదేరి, మరుసటి రోజు సాయంత్రం 16:30 గంటలకు బెనారస్ చేరుకుంటుంది. 08587 బెనారస్ - విశాఖపట్నం వీక్లీ స్పెషల్ జూన్ 22, 29 తేదీలలో సాయంత్రం 18.00 గంటలకు బెనారస్ నుంచి బయలుదేరి మరుసటి రోజు రాత్రి 20.30 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. ఈ రైళ్లు సింహాచలం, కొత్తవలస, విజయనగరం, బొబ్బిలి, పార్వతీపురం, రాయగడ, మునిగూడ, కేసింగ, టిట్లాగఢ్, బలంగీర్, బర్గర్ రోడ్, సంబల్‌పూర్, ఝర్సుగూడ, రూర్కెలా, హతియా, రాంచీ, మురి, బర్కకానా, లతేహార్, గర్వారోడ్, సగరోడ్, సజీ, భభువా రోడ్, పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ, వారణాసి స్టేషన్ల మీదుగా ప్రయాణిస్తాయి

స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగిస్తామని..

అమిత్‌షా ప్రకటన చేయాలి

ప్రజాశక్తి -గాజువాక : విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగిస్తామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రకటన చేయాలని ఉక్కు నిర్వాసిత సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఉక్కు నిర్వాసిత సంఘం నాయకులు ముద్రించిన కరపత్రాలను శనివారం పెదగంట్యాడ జంక్షన్‌లో గాజువాక ఎమ్మెల్యే నాగిరెడ్డి ద్వారా విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే గురుమూర్తిరెడ్డి, ఉక్కు నిర్వాసిత సంఘం నాయకులు పులి రమణారెడ్డి, ఎల్లేటి శ్రీనివాసరావు, గొందేసి సత్యారావు, సిఐటియు నాయకులు కణితి అప్పలరాజు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌లో ప్రభుత్వ ఉద్యోగాలు వస్తాయని, బతుకులు బాగుపడతాయని 35 సంవత్సరాలు క్రితం తక్కువ రేటుకు రైతులు భూములు, ఇల్లు ప్రభుత్వానికి ఇచ్చారన్నారు. 7 వేలకు పైగా ఆర్.కార్డుదారులు ఉక్కులో ఉపాధి కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. ఇటీవల కాలంలో ప్రతినెలా 100 మందికి తగ్గకుండా ఉక్కు ఉద్యోగులు విరమణ పొందుతున్నారని గుర్తుచేశారు. వయో పరిమితి దాటిన ఆర్ కార్డుదారులు ఉన్నారన్నారు. మరో వైపు స్టీలుప్లాంట్ కార్మికులకు వేతన ఒప్పందం చేయకుండా ఏడున్నర సంవత్సరాలుగా తాత్సారం చేస్తున్నారన్నారు. ఆర్థికంగా ఉక్కు ఉద్యోగులను, వారి కుటుంబాలను దెబ్బకొట్టేలా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని విమర్శించారు. విశాఖ ఉక్కుకు ఇవ్వాల్సిన నిధులు నిలిపి వేస్తూ, ముడి సరుకుల సరఫరా ఆపేయడంతో పాటు, ప్రధాన యూనిట్లను షట్‌డౌన్ చేస్తూ విశాఖ ఉక్కును దివాళా తీయించేందుకు కుట్రలు పన్నుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. విశాఖ పర్యటనకు వస్తున్న అమిత్ షా స్టీలుప్లాంట్‌పై ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఉదయం పెదగంట్యాడ జంక్షన్‌లో జరప తలపెట్టిన ధర్నాలో ఉక్కు నిర్వాసితులు, అన్ని రాజకీయ పార్టీలు, కార్మిక సంఘాల నాయకులు పాల్గొని నిరసన తెలపాలని కోరారు.


కరపత్రం విడుదల చేస్తున్న నాగిరెడ్డి, ఉక్కు నిర్వాసిత సంఘ నాయకులు


పోస్ట్ కార్డు ఉద్యమాన్ని ప్రారంభిస్తున్న సంఘం నాయకులు

కనీస పెన్షన్ రూ.9 వేలు ఇవ్వాలని పోస్ట్ కార్డు ఉద్యమం

ప్రజాశక్తి -గాజువాక : కనీస పెన్షన్ రూ.9 వేలు ఇవ్వాలని కోరుతూ ఆల్ పెన్షనర్స్, రిటైర్మెంట్ పర్సన్స్ ఆధ్వర్యాన పెదగంట్యాడ సిడబ్ల్యుసిలో శనివారం పోస్టుకార్డు ఉద్యమం చేపట్టారు. విశాఖ జిల్లా పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు దీనబందు మాట్లాడుతూ, పెన్షనర్లకు కనీస పెన్షన్ రూ.9,000 ఇవ్వాలని, దానికనుగుణంగా డిఎ చెల్లించాలని కోరారు. హయ్యర్ పెన్షన్ అందరికీ వర్తింప చేయాలని, రైలు ప్రయాణంలో 50 శాతం రాయితీ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు పోస్టు కార్డులను దేశ ప్రధాని మోడీకి పంపిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి కణితి అప్పలరాజు, కార్యదర్శి పిట్ట గురునాథ్, కాకినాడ పెంటారావు, శేసెట్టి అప్పారావు, ఎన్.వి.రమణ, వెంకటరావు, అప్పలనాయుడు, వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.


కళ్లద్దాలు పంపిణీ చేస్తున్న వార్డు కార్పొరేటర్ నాగేశ్వరరావు

కళ్లద్దాలు అందజేత

ప్రజాశక్తి- ములగాడ : జివిఎంసి 40వ వార్డు పరిధి ఎకెసి.కాలనీలో పశ్చిమ నియోజకవర్గం వైసిపి ఇన్‌ఛార్జి ఆడారిఆనంద్ కుమార్ సహకారంతో ఆడారి తులసీరావు చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో 52 మందికి కంటి అద్దాలను వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా గుండపు నాగేశ్వరరావు మాట్లాడుతూ, ప్రస్తుతం వయసుతో సంబంధం లేకుండా కంటి వ్యాధులకు గురవుతున్నారన్నారు. గత నెల 40వ వార్డులో ఆనంద్‌కుమార్ సౌజన్యంతో ఏర్పాటుచేసిన వైద్య శిబిరంలో సుమారు 190 మందికి కంటి పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. వారిలో 67 మందికి శీలానగర్ కిమ్స్ ఐకాన్ హాస్పిటల్‌లో ఉచితంగా ఆపరేషన్లు చేసినట్లు చెప్పారు. 52 మందికి కళ్లద్దాలు అవసరం కాగా ఆడారి తులసీరావు చారిటబుల్ ట్రస్ట్ ద్వారా అందించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు మహేష్, అశోక్, బాలకృష్ణ, శ్యామ్, సత్యనారాయణ, సురేష్, పండు, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే గణబాబు

టిడిపి మ్యానిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ప్రజాశక్తి -గోపాలపట్నం : తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయకుడు పార్టీ ప్లీనరీలో ప్రకటించిన తొలి మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని నాయకులకు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గణబాబు సూచించారు. స్థానిక లక్ష్మీ కల్యాణ మండపంలో నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలతో ఎమ్మెల్యే గణబాబు ఆధ్వర్యాన చర్చావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజల జీవన ప్రమాణాలను పెంపొందించేలా ఆరు ముఖ్యమైన పథకాలను తెలుగుదేశం పార్టీ ప్రవేశ పెట్టిందన్నారు. మహాశక్తి, యువ గళం, బీసీలకు రక్షణ చట్టం, ఇంటింటికీ మంచినీరు, పూర్ టు రిచ్ ఐదేళ్ల పాలనలో ఆదాయం రెట్టింపు అంశాలు ఉన్నాయని వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రంగనాయకులు, 90 వార్డు కార్పొరేటర్ బొమ్మిడి రమణ, పాల్గొన్నారు

ప్రహరీకి శంకుస్థాపన

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 24వ వార్డు పరిధి రేసపువానిపాలెం మ్యాక్స్ సెంటర్ సమీపంలో రూ.5 లక్షల వ్యయంతో ప్రహరీ నిర్మాణానికి కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి నేతృత్వంలో ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కె.కె.రాజు శనివారం శంకుస్థాపనచేశారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ, స్థానిక ప్రజల సమస్యను గుర్తించి ఈ ప్రహరీ నిర్మాణానికి శంకుస్థాపన చేసినట్లు తెలిపారు.

మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యం

మంత్రి విడదల రజని


వైఎస్ఆర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభిస్తున్న రజని

ప్రజాశక్తి-సీతమ్మధార : పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే జగన్మోహన్‌రెడ్డి లక్ష్యమని రాష్ట్ర వైద్య శాఖ మంత్రి, విశాఖ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి విడదల రజని పేర్కొన్నారు. జివిఎంసి 48వ వార్డు పరిధి బాబూజీనగర్‌లో సుమారు రూ.1.07 కోట్లతో నిర్మించిన డాక్టర్ వైఎస్ఆర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంత్రి రజని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి పేదవాడికీ ఇంటి వద్దకే వైద్యం అందేలా ముఖ్యమంత్రి శ్రమిస్తున్నారని తెలిపారు. మేయర్ గొలగాని హరివెంకటకుమారి మాట్లాడుతూ, నగర పరిధిలో ప్రతి వార్డులో ప్రాథమిక ఆరోగ్య ప్రారంభించారని తెలిపారు. ఉత్తర నియోజకవర్గం వైసిపి సమన్వయకర్త కె.కె.రాజు మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం రాష్ట్ర ప్రభుత్వానికి రెండు కళ్లు లాంటివని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, వార్డు కార్పొరేటర్ గంకల కవిత, ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, కార్పొరేటర్లు అనీల్‌కుమార్ రాజు, అల్లు శంకరరావు, సాడి పద్మారెడ్డి, వావిలిపల్లి ప్రసాద్, సారిపిల్లి గోవింద్, ఆళ్ల లీలావతి, ఉష్శశ్రీ, చల్లా రజిని, వార్డు ఇన్‌ఛార్జి నీలి రవి తదితరులు పాల్గొన్నారు.

టిటిసి విద్యార్థుల ఉత్పత్తులు ప్రదర్శన

ప్రజాశక్తి-విశాఖపట్నం : క్వీన్‌మేరీ ప్రభుత్వ పాఠశాలలో శిక్షణ పొందుతున్న టిటిసి విద్యార్థులు రూపొందించిన వస్తువులను శనివారం ప్రదర్శించారు. 42 రోజుల శిక్షణ ఆదివారంతో ముగుస్తున్న నేపథ్యంలో నేర్చుకున్న అంశాలకు సంబంధించి పలు వస్తువులను విద్యార్థులు రూపొందించారు. టైలరింగ్ అండ్ ఎంబ్రాయిడరీ, డ్రాయింగ్, హ్యాండ్‌లూమ్ వీవింగ్‌కు సంబంధించిన 186 మంది విద్యార్థులు తమతమ కోర్సులకు సంబంధించిన వస్తువులను తయారుచేశారు. వాటిని క్వీన్‌మేరీ పాఠశాలలో ప్రదర్శనకు పెట్టడంతో పలువురు వాటిని ఆసక్తిగా తిలకించారు. ఈ కార్యక్రమంలో ఎఐ ఎస్.మురళీమోహన్, హ్యాండ్‌లూమ్, వీవింగ్ టీచర్ కృష్ణారావు, డ్రాయింగ్ ఉపాధ్యాయులు కరుణాకర్, రవికుమార్, సైకాలజీ టీచర్లు వెంకటరమణ, రామలక్ష్మి, టైలరింగ్, ఎంబ్రాయిడరీ ఉపాధ్యాయులు సుభద్ర, సరస్వతి, ఉమ పాల్గొన్నారు.


విద్యార్థుల ఉత్పత్తులను తిలకిస్తున్న అధికారులు, ఉపాధ్యాయులు

'నెలాఖరు వరకూ సెలవులు పొడిగించాలి'

ప్రజాశక్తి-సీతమ్మధార : వేసవి ఉష్ణోగ్రతలు అధిక స్థాయిలో నమోదౌతున్న కారణంగా పాఠశాలలకు సెలవులను ఈ నెలాఖరు వరకు పొడిగించాలని కోరుతూ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, విద్యాశాఖ కమిషనర్‌కు లేఖ రాసినట్లు ఎపి బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్ పర్సన్ కేసలి అప్పారావు, కమిషన్ సభ్యులు గొండు సీతారాం ఒక ప్రకటనలో తెలిపారు. అధిక ఉష్ణోగ్రతల నమోదు దృష్ట్యా వేసవి సెలవులను పొడిగించేలా ప్రభుత్వానికి కమిషన్ తరపున సిఫారసు చేయాలని కోరుతూ అధిక సంఖ్యలో లేఖలు అందాయని పేర్కొన్నారు. ఈ మేరకు కమిషన్ తరుపున ప్రభుత్వానికి లేఖ రాసినట్లు తెలిపారు.

10 రోజుల తర్వాత తెరవాలి : విష్ణుకుమార్ రాజు

ప్రస్తుతం ఎండలు చాలా తీవ్రంగా ఉన్నాయని, రాష్ట్ర ప్రభుత్వం దీన్ని దృష్టిలో పెట్టుకొని పాఠశాలలను వారం లేదా 10 రోజుల తర్వాత తెరవాలని మాజీ ఎమ్మెల్యే, బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు విష్ణుకుమార్ రాజు కోరారు. ఇప్పుడున్న వేడి పరిస్థితులను వైజాగ్ చూడలేదని, ఈ పరిస్థితుల్లో పిల్లలు రోడ్డు మీదకు వస్తే ప్రమాదమని పేర్కొన్నారు.

భాషలో భావం ముఖ్యం

ప్రజాశక్తి-సీతమ్మధార : భాషతో పాటు భావం ముఖ్యం అని లెగ్జిగ్రాఫర్-వివిఎస్‌డి తెలుగు ఇంగ్లీష్ డిక్షనరీ రచయిత సనపల జీవన్‌కుమార్ అన్నారు. అమెరికన్ ఇంగ్లీష్ శైలి మెళకువలతో తెలుగు వారూ టాప్‌లో నిలవొచ్చు అని ఆయన పేర్కొన్నారు. తన్మయి క్రియేటివ్స్ సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యాన అమెరికన్ ఇంగ్లీషు భాష శైలికి సంబంధించి రెండో రోజు శిక్షణ నిర్వహించారు. అమెరికన్ ఇంగ్లీష్ శైలి, భాష ఉచ్ఛారణ, రాయడంలోనూ మాట్లాడడంలో ఉండే వ్యత్యాసం తదితర అంశాలను జీవన్‌కుమార్ ప్రస్తావించారు. సాఫ్ట్ వేర్ రంగం అభివృద్ధి చెందిన తరుణంలో ఆంగ్ల భాష మరీ ముఖ్యంగా అమెరికన్ శైలి అవసరం ఎంతో ఉందన్నారు. తన్మయి క్రియేటివ్స్ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు బిఎస్ చంద్రశేఖర్ మాట్లాడుతూ, పదిమందికి ఉపయోగపడే కార్యక్రమాలను మాత్రమే తమ సంస్థ ద్వారా చేపడుతున్నామని తెలిపారు. ఈ శిక్షణకు హాజరైన అందరికీ సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ క్రీడా జర్నలిస్ట్ నాగనబోయిన నాగేశ్వరరావు, తన్మయి క్రియేటివ్స్ కార్యదర్శి సిహెచ్‌వి.సత్యనారాయణ, కొణతాల రాజు, గ్రంధి సతీష్‌కుమార్, ఉప్పాడ రఘు, ఎవి రాజశేఖర్, బాదంగీర్ సాయి, సునీల్, సనపల రూపేష్‌కుమార్, వియ్యపు రామకృష్ణ, ఎస్.దుర్గారావు పాల్గొన్నారు.

గాంధీని ఆదర్శంగా తీసుకోవాలి

ప్రజాశక్తి- ములగాడ : జాతిపిత మహాత్మా గాంధీని అంతా ఆదర్శంగా తీసుకోవాలని ప్రముఖ రచయిత కె.సత్తిరాజు కోరారు. మల్కాపురంలోని శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న చిన్నారుల వేసవి శిక్షణ శిబిరంలో శనివారం ఆయన గాంధీజీ వ్యక్తిత్వంపై మాట్లాడారు. శత్రువునైనా క్షమించగలిగే ఔదార్యం ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలన్నారు. సత్యం, అహింస, సత్యాగ్రహం, సర్వోదయ, ధర్మకర్తృత్వం, గ్రామ స్వరాజ్యం తదితర సూత్రాలతో గాంధీజీ స్వాతంత్ర్యాన్ని తీసుకొచ్చిన విధానం ప్రపంచ ప్రజల మన్ననలు పొందిందని పేర్కొన్నారు. శాంతి, సోదర భావం కోసం ఆయన జీవితాన్ని అర్పించిన తీరు స్ఫూర్తిదాయకమన్నారు. కార్మిక నాయకులు బి.సత్యానందం, గ్రంథాలయాధికారి వి.అజయ్‌కుమార్, గాంధీజీపై ప్రసంగించారు. అనంతరం బాలలు గత 35 రోజులుగా వేసవి శిక్షణ శిబిరంలో నేర్చుకున్న అంశాలపై తమ మనోభావాలను తెలియజేశారు. ఈ శిక్షణ శిబిరం తమకెంతో నచ్చిందని ఆటపాటలతో వేసవి సెలవులు ఆనందంగా గడిచాయని పలువురు చిన్నారులు పేర్కొన్నారు.



మాట్లాడుతున్న బాలకృష్ణ, దొరబాబు తదితరులు

అమిత్‌షా పర్యటనను వ్యతిరేకిస్తూ

నేడు వామపక్ష పార్టీల నిరసన

ప్రజాశక్తి-అనకాపల్లి : కేంద్ర హోం మంత్రి అమిత్ షా విశాఖపట్నం పర్యటనను వ్యతిరేకిస్తూ ఆదివారం ఉదయం 10 గంటలకు చేపట్టే నిరసన కార్యక్రమంలో వామపక్ష పార్టీల కార్యకర్తలు, ప్రజాతంత్ర వాదులంతా పాల్గొని జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఆర్ దొరబాబు, సిపిఎం సీనియర్ నాయకులు ఎ.బాలకృష్ణ, జిల్లా కార్యవర్గసభ్యులు వివి శ్రీనివాసరావు, గంట శ్రీరామ్, సిపిఐ నేత నరాల సత్యనారాయణ తదితరులు పిలుపునిచ్చారు.

సిపిఎం నేత బాలకృష్ణ మాట్లాడుతూ, తొమ్మిదేళ్ల బిజెపి పాలనలో విధ్వంసకర విధానాలతో అటు వ్యవసాయాన్ని, ఇటు పారిశ్రామిక ప్రగతిని అధోగతి పాలు చేశారని విమర్శించారు. మూడు రైతు వ్యతిరేక సాగుచట్టాలు తెచ్చి 750 మంది రైతుల ప్రాణాలు బలిగొన్నారన్నారు. లక్షమంది రైతులు బిజెపి పాలనను భరించలేక ఆత్మహత్యలకు బలైపోయారని మండిపడ్డారు. సిపిఐ నేత దొరబాబు మాట్లాడుతూ ప్రభుత్వ రంగ పరిశ్రమలను తన అనుయాయులైన కార్పొరేట్ కంపెనీలకు కారు చౌకగా కట్టబెట్టే చర్యలతో దేశ ఆర్థిక వ్యవస్థను మోడీ సర్కారు సర్వనాశనం చేసిందని దుయ్యబట్టారు. అమిత్‌షా విశాఖ పర్యటనకు ముందే విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిలిపేస్తున్నట్లు కేంద్రం ప్రకటించాలని, లేకుంటే అమిత్‌షా పర్యటనకు వ్యతిరేకంగా నిరసనలు తప్పవన్నారు. జిల్లా వ్యాప్తంగా వామపక్షాల నిరసన కార్యక్రమానికి కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని గంట శ్రీరామ్, వి వి శ్రీనివాస్, నరాలశెట్టి సత్యనారాయణ తదితరులు పిలుపునిచ్చారు.

ఘనంగా బాలకృష్ణ జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేసుకున్న మాజీ ఎమ్మెల్యే పీలా

ప్రజాశక్తి -అనకాపల్లి : టిడిపి జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగజగదీశ్వరరావు ఆధ్వర్యంలో అనకాపల్లి పార్లమెంటరీ పార్టీ కార్యాలయంలో హిందూపురం ఎమ్మెల్యే, నటరత్న నందమూరి బాలకృష్ణ 64వ జన్మదిన వేడుకలు బాలకృష్ణ అభిమానులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు మధ్య ఘనంగా నిర్వహించారు. ముందుగా కేక్ కటింగ్ చేసి డాక్టర్ నారాయణరావు, పొలిమేర నాయుడు తినిపించారు. ఈ సందర్భంగా పేదలకు చీరలు పంపిణీ చేశారు. అనంతరం జగదీష్ మాట్లాడుతూ తెలుగు సినిమా ఇండస్ట్రీలో అటు నటనలోనూ, ఇటు ప్రజాసేవ చేయడంలోనూ ఎన్‌టిఆర్ తర్వాత బాలకృష్ణ తప్ప మరి ఎవరూ లేరన్నారు. తల్లి బసవతారకం పేరిట కేన్సర్ హాస్పిటల్ నిర్వహిస్తూ పేదలకు సేవ చేస్తున్నారన్నారు. హిందూపురం ప్రజలకు తన సొంత నిధులతో రూ.రెండులకే అన్న క్యాంటీన్ నిర్వహిస్తున్నారన్నారు. కార్యక్రమంలో బొలిశెట్టి శ్రీనివాసరావు, కొట్ని రామకృష్ణ, కుప్పిలి జగన్మోహన్, బొడ్డేడ మురళి, మళ్ళ గణేష్, గుడాల సత్యనారాయణ పెంటకోట రమణ పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యేపీలా అధ్వర్యంలో..

నియోజకవర్గ టిడిపి ఇంచార్జి, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి బాలకృష్ణకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సీనియర్ బాలకృష్ణ ఫ్యాన్స్ పొలిమేర నాయుడు, సరిసా నాగులను సత్కరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బిఎస్ఎంకె. జోగి నాయుడు, సిరసపల్లి సన్యాసిరావు, పోలరపు త్రినాధ్, తలారి కాశీనాయుడు, ఆళ్ల రామచంద్ర రావు, మేడిశెట్టి నూకరాజు, ఆకుల నానాజీ, కోనా శ్రీను, శివ అప్పారావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అప్పన్నను పరామర్శించిన ఎంవిఆర్



యువసేన నాయకులు అప్పన్నను పరామర్శిస్తున్న ఎంవిఆర్

ప్రజాశక్తి -అనకాపల్లి : ప్రమాదంలో గాయపడిన ఎంవిఆర్ యువసేన నాయకులు ఇల్లా అప్పన్నను ప్రముఖ వ్యాపారవేత్త ముత్యాల (గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్ అధినేత ముత్యాల వెంకటేశ్వరరావు పరామర్శించారు. ప్రమాదవశాత్తు గాయపడి, ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సమాచారం తెలుసుకున్న ఎంవిఆర్, బెంగళూరు నుంచి హుటాహుటిన అనకాపల్లి చేరుకుని, తన కుమారుడు సతీష్‌తో కలిసి శనివారం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అప్పన్న పరామర్శించారు. వైద్యానికయ్యే ఖర్చు తానే పూర్తిగా భరిస్తానని, అలాగే ఎటువంటి ఆర్థిక సహాయం కావాలన్నా చేసేందుకు సిద్ధంగా ఉన్నారని అప్పన్నకు భరోసా ఇచ్చారు. నమ్మిన బంటు ఇల్ల అప్పన్న కష్టాల్లో ఉన్నప్పుడు అండగా నిలిచిన ఎంవిఆర్ నిర్ణయంపై యువసేన హర్షం వ్యక్తం చేసింది.

12న కౌలు రైతుల మహా ప్రదర్శనను

జయప్రదం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న బాలకృష్ణ తదితరులు

ప్రజాశక్తి- అనకాపల్లి :కౌలు రైతుల ప్రచార జాతా ఈనెల 12న విజయవాడ చేరుకుంటున్న నేపథ్యంలో, అక్కడ నుంచి మంగళగిరి వరకు జరిగే మహా ప్రదర్శనకు కౌలు రైతులు తరలిరావాలని ఎపి కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎ.బాలకృష్ణ, ఉపాధ్యక్షుడు మహేశ్వరరావు, చేతివృత్తి సంఘాల నాయకుడు గంట శ్రీరామ్ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక దొడ్డి రామునాయుడు కార్మిక కర్షక నిలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కౌలు రైతులకు భూ యజమాని ఆమోదంతో నిమిత్తం లేకుండా గ్రామసభ ఆధారంగా గుర్తింపు కార్డులు ఇవ్వాలని, సున్నా వడ్డీకే రూ.లక్ష వరకు కౌలు రైతులకు వ్యవసాయ రుణం అందించాలని, వ్యవసాయంలో నూటికి 70 మంది భూమిలేని కౌలు రైతులున్నా రైతు భరోసా పొందలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పంట నష్టపరిహారం, ఇన్సూరెన్స్ సౌకర్యం భూయజమాని పొందుతున్నాడని, ఇందుకు అవకాశం కల్పించిన సిసిఆర్‌సి చట్టాన్ని సవరించి వ్యవసాయంలో కొనసాగుతున్న కౌలు రైతులకు రైతు భరోసా, పంట నష్ట పరిహారాలు, ఇన్‌పుట్ సబ్సిడీలు అందించాలని కోరారు. కౌలురైతుల డిమాండ్ల సాధనకు సిసిఎల్ఎ కార్యాలయం వద్ద జరిగే మహాధర్నాలో కౌలు రైతులంతా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కౌలు రైతుల సమస్యల పరిష్కారానికి ప్రతిపక్ష తెలుగుదేశం, జనసేన, వామపక్ష పార్టీలు కలిసి రావాలని, సోదర రైతు సంఘాలు మద్దతు తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు.

తాగునీరు అందించండి



జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న ప్రజాసంఘాల నేతలు

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి ప్రజలకు జివిఎంసి ద్వారా పరిశుభ్రమైన మంచినీటిని సరఫరా చేయాలని ప్రజా సంఘాల నేతలు కోరారు. ఈ మేరకు శనివారం జివిఎంసి జోనల్ కమిషనర్ వెంకటరమణకు వినతిపత్రం అందించారు. జోనల్ కార్యాలయంలో జెడ్‌సిని కలిసి కుళాయిలు, మంచినీటి ట్యాంకర్ల ద్వారా బురద నీరు రావడం, వచ్చిన నీటిలో నలకలు ఉండడంతోపాటు దుర్వాసన రావడంతో తాగడానికి ఇతర అవసరాలను తీర్చుకునేందుకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు.

ప్రజలకు పరిశుభ్రమైన మంచినీరు అందించాలని, వాటర్ ట్యాంకర్లను ఎప్పటికప్పుడు పరిశుభ్రం చేయాలని, పట్టణంలో రెండు పూటలా మంచి నీరు అందించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. జెడ్‌సిని కలిసి విన్నవించిన వారిలో ప్రజాసంఘాల ఐక్యవేదిక కన్వీనర్ డాక్టర్ చిన్నియాదవ్, అబ్దుల్ కలాం సేవ సంస్థ వ్యవస్థాపన చైర్మన్ ఆళ్ల ప్రవీణ్ కుమార్, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ బొబ్బిలి గోవిందరాజులు, శోభన్ బాబు సేవాసమితి చైర్మన్ ముగడ అప్పారావు, రిటైర్డ్ బిఎస్ఎన్ఎల్ జెఇ పిట్ట సూర్యారావు పాల్గొన్నారు.

హిందుజా బొగ్గు లారీలపై చర్యలు తీసుకోవాలి

సిఐటియు ఆధ్వర్యాన రాస్తారోకో



నినాదాలు చేస్తున్న సిఐటియు నేత గనిశెట్టి తదితరులు

ప్రజాశక్తి - పరవాడ: హిందుజా బొగ్గు లారీల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. శనివారం సిఐటియు ఆధ్వర్యంలో సింహాద్రి జంక్షన్ ఫార్మసిటీ ముఖద్వారం వద్ద లంకెలపాలెం, పరవాడ రోడ్డుపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా గనిశెట్టి మాట్లాడుతూ హిందూజా యాజమాన్యానికి ప్రజలు సమస్యలు పట్టడం లేదని, ఇష్టారాజ్యంగా, నిబంధనలేమీ పట్టకుండా రేయింబవళ్లు బొగ్గు లారీల రాకపోకలతో ఇళ్ల మసిబారుతున్నాయని,అధిక లోడుతో రవాణా వల్ల రోడ్లు ధ్వంసమౌతున్నాయన్నారు. బొగ్గులారీలు అతివేగంగా, నిర్లక్ష్యంగా నడపడం వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతూ, పలువురు గాయపడే పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. . రోడ్లపై ఎక్కడపడితే అక్కడ బొగ్గు లారీలు పార్కింగ్ చేసి రవాణా వ్యవస్థకు తీవ్ర ఆటంకం కలిగిస్తున్నారన్నారు. హిందూజా బొగ్గు లారీలు వలన ఉత్పన్నమయ్యే సమస్యలపై అధికారులు, పోలీసులకు పలుమార్లు విన్నవించినా కనీస చర్యలు చేపట్టకపోవడం దుర్మార్గమన్నారు. రోడ్డు మార్గంలో హిందూజాకు బొగ్గురవాణాను నిలుపుదల చేసి, . వెంటనే రైల్వే మార్గం ద్వారా సరఫరా చేసుకోవాలని కోరారు. సబ్బవరం,లంకెలపాలెం, పరవాడ, కలపాక తదితర గ్రామాలు పూర్తిగా బొగ్గు కాలుష్యంతో నిండిపోయాయని, బొగ్గు లారీల వెంట బైక్‌లు, ఇతర వాహనాలపై ప్రయాణంకష్టంగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు స్పందించి చర్యలు చేపట్టకుంటే, తామే బొగ్గులారీలను అడ్డుకోవడంతోపాటు పెద్దఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎన్ నాగప్పరావు ఎస్ సత్తిబాబు ఎస్ అప్పారావు రమణ ఎం తాతారావు తదితరులు పాల్గొన్నారు

సంజయ్‌కుమార్‌కు బంగారు పతకం



ఎం ఫార్మశీలో బంగారు పతకం సాధించిన సంజయ్ కుమార్

ప్రజాశక్తి- బుచ్చయ్యపేట: మండలంలోని వడ్డాదికి చెందిన ఎలిశెట్టి సంజయ్‌కుమార్ ఎంఫార్మశీలో గోల్డ్ మెడల్ సాధించాడు. పంజాబ్ రాష్ట్రంలోని ఛండీగఢ్ యూనివర్సిటీలో ఎం ఫార్మశీ చదువుతున్నాడు. ఎం ఫార్మసీలో గోల్డ్ మెడల్ సాధించడంతో మాజీ రాష్ట్రపతి రామనాథ్ కోవింద్ చేతుల మీదుగా శుక్రవారం యూనివర్సిటీ గోల్డ్ మెడల్, ప్రశంసాపత్రాన్ని అందుకున్నారని విద్యార్థి తండ్రి ఎలిశెట్టి ఈశ్వరరావు తెలిపారు. ఎంఫార్మశీలో సంజయ్‌కుమార్ బంగారు పతకాన్ని సాధించడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ, అభినందిస్తున్నారు.

నేడు టిడిపి సమావేశం

ప్రజాశక్తి - పరవాడ: ఈనెల 11న, ఆదివారం సాయంత్రం 3 గంటలకు సబ్బవరం పార్టీ కార్యాలయం వద్ద పెందుర్తి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ సమన్వయకమిటీ సమావేశం నిర్వహించనున్నట్లు మండల టిడిపి అధ్యక్షులు వియ్యపు చిన్నా తెలిపారు. మాజీ మంత్రి, పెందుర్తి నియోజకవర్గ టిడిపి ఇంచార్జి బండారు సత్యన్నారాయణ మూర్తి ఆధ్వర్యంలో నిర్వహించే సమావేశానికి మండలంలోని టిడిపి నేతలు, కార్యకర్తలు, తాజా,మాజీ జెడ్‌పిటిసి ,ఎంపిటిసి,సర్పంచ్‌లు, ఇతర నేతలు, తెలుగుమహిళ, తెలుగు యువత, తెలుగు విద్యార్ధి,ఇతర అనుబంధ సంఘాలు నాయకులు, సమన్వయ కమిటీ నాయకులంతాహాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఆలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

ప్రజాశక్తి- సబ్బవరం: మండలంలోని మల్లునాయుడుపాలెం గ్రామంలో రావాలమ్మ ఆలయ పునర్నిర్మాణానికి స్థానిక ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ శనివారం శంకుస్థాపన చేశారు. సర్పంచ్ బోను దేముడమ్మ గంగు నాయుడు, గండి వారి కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే అదీప్‌రాజ్ మాట్లాడుతూ ఆలయ మండపం నిర్మాణానికి మండల పరిషత్ నిధులు రూ.4 లక్షలు, తమ సొంత నిధులు రూ.లక్ష ఇస్తున్నట్లు ప్రకటించారు.
ఈ సందర్భంగా వైసిపి రాష్ట్రకార్యదర్శి చొక్కాకుల వెంకటరావు మాట్లాడుతూ రావాలమ్మ ఆలయం నిర్మాణానికి తమ సొంత నిధులు లక్ష రూపాయలు, తన సోదరుడైన సబ్బవరం మండల వైస్ ఎంపిపి-2 చొక్కాకుల గోవింద తరపున మరో రూ.ఒక లక్ష ఇస్తున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో ఎంపిపి బోకం సూర్యకుమారి రామునాయుడు, వైస్ ఎంపిపి-2చొక్కాకుల గోవింద, వైసిపి నేతలు కోటాన రాము, మోపాడ అప్పారావు, ఎంపిటిసి గొర్లి కనకరాజు, మాజీ సర్పంచ్ కోటాన దేముడు, కోటాన వెంకట రమణ, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

వడదెబ్బ పట్ల అప్రమత్తత అవసరం



ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న వైస్ ఎంపిపి

ప్రజాశక్తి -వడ్డాది: వడదెబ్బ నుంచి ఉపశమనానికి ఓఆర్ఎస్ ప్యాకెట్లు తీసుకోవాలని వైస్ ఎంపిపి దొండా లలిత నారాయణమూర్తి అన్నారు. శనివారం బుచ్చయ్యపేట మండలం వడ్డాదిలో అతిథి దేవోభవ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు ఈ సందర్భంగా లలిత నారాయమూర్తి మాట్లాడుతూ ఎండ తీవ్రత ఎక్కువగా ఉందని, ఉదయం నుండి 10 గంటల లోపు బయట పనులను చక్కబెట్టి ఇళ్లకే చేరుకోవాలన్నారు. అత్యవసరమైతే, తగు జాగ్రత్తలు తీసుకుని బయటకు వెళ్లాలే తప్ప, ఎండలో నిర్లక్ష్యంగా తిరిగితే వడదెబ్బకు గురై ప్రాణాలు కోల్పోయే ప్రమాదం కూడా ఉందన్నారు. వృద్ధులు, చిన్నారులు, మహిళలు, అనారోగ్యంతో బాధపడుతున్న వారు ఎండల తీవ్రత నుంచి ఉపశమనానికి ఎప్పటికప్పుడు చల్లని పానీయాలు తీసుకోవాలని సూచించారు. నిమ్మరసం చల్లని మజ్జిగ, కొబ్బరిబొండాలు, ఓఆర్ఎస్‌లను క్రమం తప్పకుండా తీసుకోవడం ద్వారా వేసవితాపం నుంచి ఉపశమనం పొందవచ్చన్నారు. అతిథి దేవోభవ స్వచ్ఛంద సేవ సంస్థ నిర్వాహకుడు అరి పాక కామేశ్వరరావు పాల్గొన్నారు

క్రీడలతో ఆరోగ్యం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని ఎపి స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ప్రభుత్వ సలహాదారు జి.శ్రీధర్ రెడ్డి అన్నారు. అన్నెపు రామచందర్ వంటి శిక్షకులు ఈ తరం క్రీడాకారులకు దొరకడం అదృష్టమన్నారు. పుట్ట మన్మథరావు మెమోరియల్ క్లబ్ ఆధ్వర్యంలో ఎయు ఫిజికల్ ఎడ్యుకేషన్ సౌజన్యంతో ఏర్పాటైన బాస్కెట్‌బాల్ సమ్మర్ టోర్నమెంట్‌ను ఆయన ముఖ్య అతిథిగా హాజరై శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రామచందర్ శిక్షణలో ఇప్పటికే ఎందరో జాతీయ స్థాయి క్రీడాకారులుగా ఎదగడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ప్రధాన శిక్షకులు రామచందర్, విశాఖ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షులు రామ్ మోహన్‌రావు, యూనియన్ బ్యాంకు సీనియర్ మేనేజర్ జి.అప్పారావు, ఇంపీరియల్ డిజైనర్ మహేశ్వరరావు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లతో విద్యుత్ ఛార్జీల భారం

పేదలపై కక్షతోనే కరెంట్ ఛార్జీల పెంపు .... వైసిపి సర్దుబాటు ఛార్జీలపై టిడిపి నేతల ధ్వజం



వడ్డాదిలో మాట్లాడుతున్న తాతయ్యబాబు

ప్రజాశక్తి- అనకాపల్లి : పేదల ఇళ్లకు స్మార్ట్‌మీటర్లు ఏర్పాటు దారుణమని మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పీలా గోవింద సత్యనారాయణ ఆరోపించారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటుతో పేద మధ్యతరగతి కుటుంబాలపై ఆర్థిక భారం పడుతున్నారు. జగన్ మోహన్ రెడ్డి అసమర్థ పాలన వల్లే డిస్కంలు నష్టాల్లోకి కూరుకుపోతున్నా యన్నారు. నాలుగేళ్లలో ఎనిమిది సార్లు విద్యుత్ ఛార్జీలను పెంచి, ఇపుడు సర్దుబాటు ఛార్జీల భారాన్ని కూడా వినియోగదారులపై వేయడం దుర్మార్గమన్నారు. వైసిపి ప్రభుత్వం విండ్ పవర్ పిపిఎలను రద్దు చేయడంతోనే రాష్ట్రంలో విద్యుత్ సంక్షోభం ఏర్పడిందన్నారు.
రాష్ట్రంలో ఎక్కడ చూసినా కరెంట్ కోతలేనని, అప్రకటిత విద్యుత్ కోతలతో గ్రామాలలోని చిన్న, మధ్య తరహా పరిశ్రమలు మూతపడి ప్రజలు ఉపాధి కోల్పోతున్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సిరస పల్లి సన్యాసి రావు, బిఎస్ఎంకె జోగి నాయుడు, పోలారపు త్రినాథ్, కర్రి బాబీ, ఆకుల నానాజీ, మరపురెడ్డి సత్యనారాయణ (సైనిక్), కంకణాల ఆదిమూర్తి, సిరసపల్లి సత్తిబాబు, చదరం శివ అప్పారావు, రమేష్, బోయిన పైడిరాజు, ఆళ్ళ జగన్ పాల్గొన్నారు.

జగన్ అసమర్థ పాలన వల్లే కరెంట్ కష్టాలు: తాతయ్యబాబు

వడ్డాది : సర్దుబాటు పేరుతో విద్యుత్ ఛార్జీలను పెంచడం, గృహ విద్యుత్ కనెక్షన్లకు స్మార్ట్‌మీటర్లు బిగించడం దారుణమన్నారు. జగన్ అసమర్థ పాలన వల్ల రానున్న పదేళ్లపాటు విద్యుత్ వినియోగదారులపై ఛార్జీల భారం పడుతుందని చోడవరం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి బత్తుల తాతయ్యబాబు మండిపడ్డారు. శనివారం వడ్డాదిలోని పార్టీ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ, స్మార్ట్ మీటర్ల వల్ల ఒక్కో కుటుంబంపై నెలకు కనీసం రూ.102భారం పడుతుందన్నారు..జగన్ రెడ్డి అసమర్థ పాలన వల్లే డిస్కంలు నష్టాల్లోకి కూరుకుపోతున్నా యన్నారు. నాలుగేళ్లపాలనలో ఎనిమిది సార్లు విద్యుత్ ఛార్జీలను పెంచి ప్రజలపై రూ.57వేల కోట్ల భారం వేసిన జగన్ సర్కారు, ఇపుడు స్మార్ట్‌మీటర్లతో పేదలపై ఏటా వేలకోట్ల భారం వేయాలని చూస్తోందన్నారు. విద్యుత్ సర్దుబాటు ఛార్జీల పేరుతో యూనిట్ వాడకంపై అదనంగా రూ.0.40పైసలు అదనపు భారం తప్పదన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే చంద్రబాబు పాలనలో విద్యుత్ ఛార్జీలను నియంత్రిస్తామన్నారు. తక్కువ ధరకే లభ్యమయ్యే పవన విద్యుత్ ఒప్పందాలను వైసిపి ప్రభుత్వం రద్దుచేసి, ఛార్జీల భారం మరింతగా పెరగడానికి, విద్యుత్ సంక్షోభానికి కారణమైందని మండిపడ్డారు. ఎడాపెడా కరెంట్ కోతలతో రాష్ట్ర ప్రజలు అల్లాడిపోతున్నా, అసమర్థ వైసిపి ప్రభుత్వం చేతులెత్తేసిందన్నారు. జగన్ పాలనలో వైసిపి మంత్రులు, ఎమ్మెల్యేలు తప్ప మరెవరూ సంతోషంగా లేరని, చివరకు ఆపార్టీ కార్యకర్తలు కూడా ఉసూరుమంటున్నారని ఆరోపించారు. విద్యుత్ రంగాన్ని గాడిలో పెట్టే సత్తా, సామర్థ్యం ఒక్క చంద్రబాబుకే ఉందన్నారు. సమావేశంలో తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షులు సిరిగిరి శెట్టి శ్రీరామ మూర్తి సాయం శేషు అక్కిరెడ్డి కనకరాజు పాల్గొన్నారు



కె.కోటపాడులో మాట్లాడుతున్న పివిజి.కుమార్

ముఖ్యమంత్రిగా జగన్ అనర్హుడు : పివిజి.కుమార్

కె కోటపాడు : ముఖ్యమంత్రిగా జగన్ పూర్తిగా అనర్హుడని, నాలుగేళ్ల వైసిపి పాలనలో రాష్ట్రం దుస్థితి ఇందుకు నిదర్శనమని మాడుగుల నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పివిజి.కుమార్ ఆరోపించారు. స్థానిక పెట్రోల్ బంకు వద్ద విలేకర్లతో మాట్లాడుతూ, మాట తప్పను, మడమ తిప్పను అంటూ రాష్ట్రాన్ని అథోగతి పాల్జేశారని మండిపడ్డారు. 2019 నాటికి జగన్ ప్రభుత్వానికి పదివేల మెగావాట్‌ల మిగులు విద్యుత్‌ను టిడిపి అధినేత చంద్రబాబు అప్పగిస్తే, అస్తవ్యస్త నిర్ణయాలతో ఇపుడు అప్రకటిత కోతలతో అవస్థలు పడే పరిస్థితికి తీసుకొచ్చారన్నారు.
నాలుగేళ్లలో ఎనిమిది సార్లు కరెంట్‌ఛార్జీలను పెంచి ప్రజలపై రూ.57వేల కోట్ల భారం వేశారని, ఇపుడు సర్దుబాటు అంటూ మళ్లీ ఛార్జీల మోతకు సిద్ధపడుతున్నారన్నారు. పాలనలో అసమర్థుడైన జగన్ ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమములో కశిరెడ్డి అప్పల నాయుడు, సబ్బవరపు రామునాయుడు, జూరెడ్డి రాము, పైలా నారాయణమూర్తి, కన్నూరు సూర్యనారాయణ పాల్గొన్నారు

ఎంఎంఎల్ కళాశాల అభివృద్ధికి కృషి



లింగమూర్తి విగ్రహానికి నివాళులర్పిస్తున్న పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి -అనకాపల్లి : ఎఎంఎఎల్ కళాశాల అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామని ఆ కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం ప్రకటించింది. శనివారం కళాశాల ఆవరణలో పూర్వ విద్యార్థుల సంఘం కార్యాలయ ప్రారంభోత్సవం, నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమాలు జరిగాయి. కళాశాల పాలకవర్గ సభ్యులు వాసిరెడ్డి బాలకృష్ణ, ప్రిన్సిపల్ డాక్టర్ గల్లా జయబాబు, పర్యవేక్షకురాలు పెంటకోట అనురాధ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పూర్వవిద్యార్థుల సంఘం నూతన కార్యవర్గం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ముందుగా కళాశాల ఆవరణలో సరస్వతి దేవి విగ్రహానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. కళాశాల వ్యవస్థాపకులు కొరుకొండ లింగమూర్తి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యాలయాన్ని పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షులు బొడ్డేడ అప్పారావు, కార్యదర్శి పెనుమత్స కష్ణంరాజు, కోశాధికారి ఎల్లేటి జగదీశ్వరరావు ప్రారంభించారు.
ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కళాశాల ఆవిర్భావం నుంచి అనకాపల్లి వర్తకసంఘం ఒకే తీరున కళాశాలను నిర్వహిస్తుందన్నారు. దేశ విదేశాల్లో ఉన్న పూర్వ విద్యార్థుల సహాయ సహకారాలు తీసుకొని కళాశాల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.నూకరాజు, బొండాడ రాజు, ఉప తహసిల్దార్ సింగంపల్లి వాసు, నిరుజోగి నరసింహ మూర్తి, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

జిపిఎస్‌తో ఉద్యోగ, ఉపాధ్యాయులకు నష్టం

ప్రజాశక్తి- అనకాపల్లి : అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లోనే రద్దు చేస్తామన్న సిపిఎస్ స్థానంలో జిపిఎస్ అమలు చేయాలన్న రాష్ట్ర మంత్రివర్గ నిర్ణయం రాష్ట్రంలో సుమారు 3 లక్షల మంది ఉద్యోగ ఉపాధ్యాయులను తీవ్ర నిరాశకు గురి చేసిందని టిడిపి జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగ జగదీశ్వరరావు విమర్శించారు. శనివారం పార్లమెంటరీ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, తాము అధికారంలోకి వస్తే వారం రోజుల్లో సిపిఎస్ రద్దు చేసి తీరుతామని ఎన్నికలకు ముందు హామీ ఇచ్చి, నాలుగేళ్ల తర్వాత ఎన్నికలు సమీపిస్తున్న వేళ జిపిఎస్ అంటూ జగన్ రెడ్డి మరోసారి మోసం చేసేందుకు కంకణం కట్టుకున్నాడన్నారు. 2019 ఎన్నికల్లో మేనిఫెస్టో ఇచ్చిన హామీ ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తామని హామీనిచ్చి, ఇపుడు అమలుకు వచ్చేసరికి 2014 జూన్ రెండు నాటికి ఐదు సంవత్సరాలు సర్వీస్ పూర్తి చేసుకున్న వారికి మాత్రమే రెగ్యులరైజ్ చేస్తామని నిబంధన సరైంది కాదని, ఇదేనా జగన్ రెడ్డి విశ్వసనీయతని నాగ జగదీష్ ప్రశ్నించారు. రాష్ట్ర విశ్రాంతి ఉపాధ్యాయుల సంఘ కార్యదర్శి బుద్ద కాశీ విశ్వేశ్వరరావు, అనకాపల్లి జిల్లా విశ్రాంత ఉపాధ్యా యులు కాంగ్రెగుల సత్యనారాయణ మాట్లాడుతూ, పదవీ విరమణ చేసిన ఉద్యోగ ఉపాధ్యాయులకు తక్షణం డిఎ, ఎరియర్స్‌తోపాటు పిఆర్‌సి బెనిఫిట్స్ ఇచ్చి తీరాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

పైడిరాజు మరణం తీరనిలోటు



నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి

ప్రజాశక్తి- కె కోటపాడు : మండలంలోని మర్రివలస గ్రామ టిడిపి కార్యకర్త కొల్లి పైడిరాజు మరణం వారి కుటుంబంతోపాటు పార్టీకి తీరనిలోటని మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు ఆవేదన వ్యక్తం చేశారు.శనివారం మర్రివలస వెళ్లి, పైడిరాజు ,భార్య, పిల్లలు, కుటుంబసభ్యులను పరామర్శించారు. వారిని ఓదార్చి, టిడిపి వారికి ఎల్లవేళలా అండగా ఉంటుందని భరోసానిచ్చారు. ఈసందర్భంగా పార్టీ శ్రేణులతో కలిసి, పైడిరాజు చిత్రపటానికి నివాళులర్పించారు. టిడిపి రైతు కార్యదర్శిగా, ఇతర పార్టీ వ్యవహారాల్లో కీలకంగా ఉన్న పైడిరాజు మృతికి సంతాపం తెలిపారు.కార్యక్రమంలో సిమునురు, రమణ, కన్నూరు పోతన్నరెడ్డి, అప్పల నాయుడు, ఇల్లాకు రాము, సిమునురు అప్పలకొండ, కోటాన సూరి దేముడు, కన్నూరు సూరిబాబు, సూర్యనారాయణ, రావాడ వెంకటరమణ పాల్గొన్నారు

వికలాంగులకు మోటారు వాహనాలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : వికలాంగుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడుదల రజిని తెలిపారు. శనివారం కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వికలాంగులకు మోటారు వాహనాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సుమారు లక్ష రూపాయల విలువ చేసే అరవై వాహనాలను లబ్ధిదారులకు అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, ఎంపీ ఎంవివి.సత్యనారాయణ, వికలాంగులు, వయోవృద్ధుల సహకార సంస్థ ఛైర్మన్ ముంతాజ్ పఠాన్, సహాయ సంచాలకులు కె.మాధవి పాల్గొన్నారు.

మండుతున్న ఎండలు

-అధిక ఉష్ణోగ్రతతో
ప్రజల ఇక్కట్లు
-నిర్మానుష్యంగా రహదారులు


మాడుగులలో నిర్మానుష్యంగా ఉన్న రోడ్డు

ప్రజాశక్తి-మాడుగుల: మండు టెండలు, అధిక ఉష్ణోగ్రతలు, ఉక్క పోతలతో ప్రజలు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. రోహిణి కార్తె ముగిసిన తర్వాత శనివారం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంది. ఉదయం చల్లటి గాలులతో భారీ వర్షం కురుస్తుందని వాతావరణం కనిపించింది. పది గంటల నుండి అధిక ఉష్ణోగ్రతలతో ఎండకాసింది. మరి కొద్ది రోజులలో రుతుపవనాలు ప్రవేశిస్తాయని ప్రజలు ఎదురు చూస్తున్న సమయంలో ఎండ ప్రతాపం చూపించింది. దీంతో, అధిక వేడి ఒక ఉక్క పోతలతో ప్రజలు నానా అగచాట్లు పడ్డారు.

నక్కపల్లి:నక్కపల్లిలో శనివారం భానుడు నిప్పులు కురిపించాడు. గతంలో ఎన్నడూ లేని విధంగా రికార్డ్ స్థాయిలో ఉష్ణోగ్రత నమోదయింది. బయటకు వెళ్లిన వారిపై నెత్తిన నిప్పుల కుంపటి పెట్టినట్లుగా భానుడు తన ప్రతాపాన్ని చూపాడు. 43.37 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. మధ్యాహ్నం 12గంటల నుంచి ఎండతో పాటు తీవ్రమైన వడగాడ్పులు వీయడంతో ఇంటి నుంచి బయటకు రావడానికే ప్రజలు హడలిపోయారు. మండల కేంద్రమైన నక్కపల్లి సహా పల్లె గ్రామాల్లో కూడా రహదారులన్నీ నిర్మానుష్యంగా దర్శనమిచ్చాయి. ఎండ వేడిమికి తట్టుకోలేక జనం బయటకు రావడానికి సాహసించలేదు. తప్పని పరిస్థితుల్లో బయటికి వచ్చిన వారు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. తీవ్రమైన వడగాల్పులు వీయడంతో వాహనాలపై ప్రయాణాలు సాగించేవారు తీవ్ర అవస్థలు పడ్డారు. మహిళలు చీర కొంగును నెత్తిపై కప్పుకుని ప్రయాణాలు సాగించారు. సాయంత్రం 6గంటలకు కూడా ఎండ వేడి తగ్గకపోవడంతో వృద్ధులు, గర్భిణీలు, బాలింతలు, పిల్లలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అప్రకటిత విద్యుత్ కోతలతో ఫ్యాన్లు, ఏసీలు పనిచేయక పోవడంతో ఇళ్ల దగ్గర ఉన్నవారు కూడా తీవ్ర ఇబ్బందులు పడ్డారు.


నక్కపల్లిలో ఎండలో నడిచి వెళుతున్న మహిళ


పనులను పరిశీలిస్తున్న నేతలు

రహదారి పనుల పరిశీలన

ప్రజాశక్తి-మాడుగుల:మండల కేంద్రంలోని జావ్వాధి గెడ్డ నుండి శివాలయం ప్రధాన రహదారి వరకు 15 లక్షలతో నిర్మించిన రహదారి దాదాపు పూర్తి అయిందని ఎంపీపీ పెదబాబు తెలిపారు శనివారం ఆయనతోపాటు వైసీపీ నేతలు రహదారి పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,అనేక సంవత్సరాలుగా ఈ మార్గంలో రహదారి నిర్మాణం జరగలేదని, ప్రజలకు ఎంతో అవసరమైన ఈ రహదారి నిర్మాణం ప్రభుత్వ హయాంలో నిర్మించామని తెలిపారు. ఈ రహదారి నిర్మాణానికి 15 లక్షలు ఖర్చు చేశామని తెలిపారు. మాడుగుల టీచర్స్ కాలనీ, అర్బన్ కాలనీలలో కోటి 5 లక్షలతో 21 రహదారుల నిర్మాణాలు పూర్తి అయ్యాయని, త్వరలో కాలువల నిర్మాణం చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎడ్ల కళావతి, వైస్ సర్పంచ్ శ్రీనాథ్ శ్రీనివాసరావు, సచివాలయ మండల కన్వీనర్ బొమ్మిశెట్టి శ్రీనివాసరావు, హేమంత్, గణేష్ పాల్గొన్నారు.

వారాహి యాత్రను జయప్రదం చేయండి

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్:ఈ నెల 14 నుంచి జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ నిర్వహించే వారాహి యాత్రను విజయవంతం చేయాలని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, వారాహి రథయాత్ర సమన్వయకర్త బొలిశెట్టి సత్యనారాయణ, అరకు పార్లమెంట్ ఇంచార్జ్ వి.గొంగులయ్య పిలుపునిచ్చారు. శనివారం జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్చార్జ్ రాజాన వీర సూర్యచంద్ర ఆధ్వర్యంలో నర్సీపట్నం ఎన్జీఒ హోమ్‌లో వారాహి యాత్రకు ప్రత్యేక సమావేశం నిర్వహించారు.పోస్టర్లను ఆవిష్కరించిన సత్యనారాయణ మాట్లాడుతూ, వారాహి యాత్ర ద్వారా ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడతామన్నారు. ఈ కార్యక్రమంలో పాడేరు ఇన్చార్జ్, నర్సీపట్నం వారాహి యాత్ర సమన్వయకర్త వంపూరు గంగులయ్య, టౌన్ అధ్యక్షులు అద్దేపల్లి గణేష్, నాయకులు గండెం దొరబాబు, వెంకటరమణ, శివ, వూడి చక్రవర్తి, కర్రి సంతోష్, కొండలరావు పాల్గొన్నారు.

మంచినీటికి అవస్థలు

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలో అమ్మపేట గ్రామంలో వాటర్ ట్యాంకుకు విద్యుత్ సరఫరా లేక మూడు రోజుల నుండి గ్రామస్థులు మంచినీటికి తీవ్ర ఇబ్బంది పడుతున్నారని సర్పంచ్ నిద్ర దేవుడు నాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని విద్యుత్ లైన్ మేన్‌లకు ఫోన్లు చేసి చెప్పినా పట్టించుకోలేదన్నారు. విద్యుత్ స్తంభాలపైన చెట్ల రెబ్బలు విరిగినా లైన్ మేన్లు పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా సమస్యను తక్షణమే పరిష్కరించాలని ఆయన కోరారు.

గ్రంథాలయాలను వినియోగించుకోవాలి

మున్సిపల్ వైస్ ఛైర్మన్ సన్యాసిపాత్రుడు - ముగిసిన వేసవి విజ్ఞాన శిబిరాలు


మాట్లాడుతున్న సన్యాసి పాత్రుడు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: గ్రంథాలయం అంటే ఒక విజ్ఞాన గని అని, వీటిని వినియోగించు కోవాలని మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్ చింతకాయల సన్యాసి పాత్రుడు కోరారు. స్థానిక ఐదు రోడ్ల జంక్షన్లో శాఖా గ్రంథాలయంలో శనివారం జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు త్రిమూర్తులు రెడ్డి అధ్యక్షతన వేసవి విజ్ఞాన శిబిరం ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సన్యాసి పాత్రుడు మాట్లాడుతూ, నర్సీపట్నం శాఖా గ్రంథాలయానికి తన వంతుగా సోలార్ సిస్టం ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారు. నిర్వహణ, అభివద్ధిలో జిల్లాలోనే ప్రథమ స్థానంలో శాఖ గ్రంథాలయాన్ని తీర్చిదిద్దిన గ్రంథాలయాధికారి పి.దమయంతిని కొనియా డారు.

మండల విద్యాశాఖాధికారి జి.సాయి శైలజ మాట్లాడుతూ, సమ్మర్ క్యాంప్‌ను ఎంతోమంది సహకారంతో అద్భుతంగా నిర్వహించారన్నారు. సమ్మర్ క్యాంపు నిర్వహణలో జన విజ్ఞాన వేదిక సహకారం తీసుకోవడం అభినందనీయమన్నారు. విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత గ్రంథాలయ అధికారి జి మురళీకృష్ణ, ప్రముఖ ఆర్థోపెడిక్ డాక్టర్ రాజు, డాక్టర్ జి.అలేఖ్య దివ్య, విశ్రాంత మండల విద్యాశాఖ అధికారి కాగిత అప్పారావు, విశ్రాంత ప్రిన్సిపాల్ కుమార్ బాబు, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీత ప్రభాకర్‌రావు, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షులు కన్నబాబు తదితరులు పాల్గొన్నారు.


కోటవురట్లలో మాట్లాడుతున్న గ్రంథాలయాధికారి

కోటవురట్ల: చిన్నారులు పుస్తక పఠనంపై మక్కువ పెంచుకోవాలని గ్రంథాలయ అధికారి అప్పలనాయుడు సూచించారు. వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా శాఖ గ్రంథాలయంలో రిసోర్స్ పర్సన్ మస్తాన్ చిన్నారులతో పుస్తక పఠనం చదివించారు.

ఉపాధి పని దినాలు పెంచాలి

ప్రజాశక్తి-ఎస్.రాయవరం:మండలంలో సైతారుపేట గ్రామంలో శనివారం ఉపాధి కూలీలతో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎం సత్యనారాయణలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇరువురు నాయకులు మాట్లాడుతూ, కూలీలకు ఉపాధి పని దినాల సంఖ్యను పెంచాలన్నారు. వ్యవసాయ పనులు బాగా తగ్గాయని, ప్రస్తుతం జాబ్ కార్డుకు కేవలం 100 రోజులు మాత్రమే పని కల్పిస్తున్నారని, ఇవి కూలీలకు సరిపోలేదన్నారు. దీంతో కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. 200 రోజులు పని కల్పించాలని కోరారు. వేసవి అలవెన్సులు, పనిముట్లకు అదనంగా గతంలో ఇచ్చిన విధంగా అదనంగా డబ్బులు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో వీసం రాంబాబు, చిన్న నాయుడు, రఘురాం, సత్యవతమ్మ, సూర్యకళ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అప్పలరాజు, సత్యనారాయణ

ఛైర్‌పర్సన్, వైస్ ఛైర్మన్ బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు స్వీకరించిన సుబ్బలక్ష్మి, రామకృష్ణ

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్: మున్సిపాలిటీ చైర్ పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ శనివారం లాంఛనంగా పదవీ బాధ్యతలు చేపట్టి మున్సిపల్ కార్యాలయంలో తమ చాంబర్లో అడుగుపెట్టారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ, నర్సీపట్నం మున్సిపాలిటీ పరిధిలో మంచినీటి సరఫరా, పారిశుధ్యం, వీధిలైట్లు ప్రాధాన్య అంశాలుగా తీసుకొని, ప్రజలకు అసౌకర్యం కలగకుండా శక్తివంచన లేకుండా కృషి చేస్తామని సుబ్బలక్ష్మి అన్నారు. వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ మాట్లాడుతూ, ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేస్తామన్నారు. తమకు ఇచ్చిన ఈ అవకాశాన్ని నిలబెట్టుకుంటామని చెప్పారు.

బోరు పనులు ప్రారంభం

ప్రజాశక్తి-రోలుగుంట:మండలంలోని బుచ్చింపేట గ్రామంలో చేతి వృత్తులు చేసుకొనే (మేదరి పేట)సుమారుగా 80 కుటుంబాలు నీటి సమస్య తో గత కొంత కాలంగా బాధపడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఇదే గ్రామానికి చెందిన అనిమిరెడ్డి రమణ తన సేవా కార్యక్రమంలో భాగంగా సొంత నిధులతో బోరును తవ్వి మోటారు, ట్యాంక్‌ను ఏర్పాటు చేసి నీటి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ మేరకు శనివారం తన సొంత నిధులతో బోరు పనులు ప్రారంభించారు. ఈ మేరకు అనిమిరెడ్డి రమణ చేస్తున్న సేవల పట్ల గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.


ప్రారంభిస్తున్న రమణ


సచివాలయ సిబ్బందితో ఎమ్మెల్యే

సచివాలయం ప్రారంభం

ప్రజాశక్తి- నక్కపల్లి:సచివాలయ వ్యవస్థతో ప్రజల ముంగిటకు సేవలు అందిస్తున్నట్లు ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. మండలంలోని పెదదొడ్డిగల్లు గ్రామంలో శనివారం సచివాలయ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలు సచివాలయ వాలంటీర్ల వ్యవస్థ ద్వారా ప్రజలకు సకాలంలో అందజేయడం జరుగుతుందన్నారు. సచివాలయ ఆవరణంలో మొక్కలు నాటారు. అనంతరం గ్రామంలో గడపగడపకు కార్యక్రమంలో భాగంగా పర్యటించారు. వాటర్ ట్యాంకు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రత్నం, జడ్పిటిసి సభ్యులు కాసులమ్మ, సర్పంచ్‌లు గొర్ల విజయలక్ష్మి కుమారి, మున్నిషా బేగం, నాయకులు నాగ అప్పలరాజు, వీసం నానాజీ, నరసింహమూర్తి పాల్గొన్నారు.

ఎట్టకేలకు బియ్యం పంపిణీ

-ఫలించిన సిపిఎం, ఎపి ఆదివాసీ గిరిజన సంఘం పోరాటం

ప్రజాశక్తి-కొత్తకోట:రావికమతం మండలం చీమల పాడు శివారు కళ్యాణపులోవ జిసిసి రేషన్ డిపో పరిధిలో ఆదివాసి రేషన్ లబ్దిదారులకు ఎట్టకేలకు బియ్యం పంపిణి చేపట్టారు. సిపిఎం, ఎపి ఆదివాసీ గిరిజన సంఘంతో పాటు పలు ప్రజాసంఘాల పోరాటం ఫలితంగా మార్చి, ఏప్రిల్ నెలలకు చెందిన మూడు టన్నుల బియ్యన్ని జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు లబ్ధిదారులకు శుక్ర, శనివారాలలో పంపిణి చేశారు. జెడ్. జోగింపేట, రొచ్చుపనుకు, తాడిపర్తి, బంగారు బందల, ఆజేయపురం తదితర గిరిజన గ్రామాల్లోని 236 మంది రేషన్ కార్డుదారులకు మార్చి, ఏప్రిల్ నెలకు సంబంధించి మూడు టన్నుల ఉచిత బియ్యం ఇవ్వాల్సి ఉండగా వారితో వేలిముద్రలు వేయించుకుని డిపో సేల్స్ మెన్ బ్లాక్ మార్కెట్లో అమ్ముకున్నాడు. సీపీఎం, గిరిజన సంఘం ఆధ్వర్యంలో రేషన్ కార్డుదారులతో ఆందోళనలు చేపట్టడం తో పాటు స్పందనలో కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేశారు. దీనిపై ఏప్రిల్ 17న పలు వార్త పత్రికలలో కథనాలు ప్రచురితమయ్యాయి దీనిపై రావికమతం తహసీల్దార్ మహేశ్వరరావు, సీఎస్‌డీటీ ఈశ్వరరావు విచారణ చేపట్టి సేల్స్ మెన్ అప్పారావు బియ్యం ఇవ్వకుండా పక్కదారి పట్టించినట్లు గుర్తించారు. సేల్స్ మెన్‌పై 6ఎ కేసు నమోదు. చేశారు. రెండు నెలల బియ్యం తిరిగి ఇస్తామని గిరిజనులకు హామీ ఇచ్చారు. నెలలు గడిచినా బియ్యం ఇవ్వక పోవడంతో ఇటీవల సీపీఎం నాయకులు ఆధ్వర్యంలో మరో మారు కలెక్టరేట్ వద్ద ఆందోళన చేపట్టి స్పందనలో పిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన కలెక్టర్ బియ్యం పంపిణీకి చర్యలు తీసుకోవాలని డీఎస్‌వోను ఆదేశించారు. దీంతో, సీఎస్‌డిటి ఈశ్వరరావు కల్యాణపులోవ జీసీసీ సేల్స్ డిపో వద్ద శుక్ర, శనివారాల్లో బియ్యం పంపిణీ చేయించారు.


బియ్యం పంపిణీ చేస్తున్న అధికారులు


తనిఖీలు చేపడుతున్న డిఆర్ఎం

రైల్వే డిఆర్ఎం ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ :దొండపర్తిలోని డాల్ఫిన్‌నోస్ కాలనీలో ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్‌లో డివిజనల్ రైల్వే మేనేజర్ అనూప్ సత్పతి ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. విద్యుత్ సరఫరా సమస్యలు, కోతలతో ప్రజలకు అసౌకర్యం కలుగుతోందని వచ్చిన ఫిర్యాదుల మేరకు ఎలక్ట్రికల్ జనరల్ అధికారులతో పాటు డిఆర్ఎం కాలనీ ప్రజలతో భేటీ అయ్యారు. సాయంత్రంలోగా అన్ని సమస్యలనూ పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అధిక శక్తిగల ట్రాన్స్‌ఫార్మర్లు, ఇతర ఎలక్ట్రికల్ పరికరాలు ఏర్పాటు చేయాలన్నారు. రెండు రోజుల్లో విద్యుత్ సమస్యలను శాశ్వతంగా పరిష్కరిస్తామని కాలనీవాసులకు హామీ ఇచ్చారు.

ఓటమి భయంతో ఓట్ల తొలగింపు

- మాజీ మంత్రి అయ్యన్న



ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:సిఎం జగన్మోహన్ రెడ్డి ఓటమి భయంతో ఓట్లను తొలగిస్తున్నారని మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు విమర్శించారు. ఈ మేరకు శనివారం మీడియాతో మాట్లాడారు. ఓటర్ల జాబితా ప్రక్షాళన పేరుతో రాష్ట్రంలో లక్షల సంఖ్యలో టిడిపి సానుభూతిపరుల ఓట్లు భారీగా తొలగిస్తున్నారని, ఏ కారణంతో తొలగిస్తున్నారో కనీసం నోటీసు కూడా జారీ చేయక పోవడం దారుణమన్నారు. నిబంధనల ప్రకారం ఈ తొలగింపు ప్రక్రియ బూత్ లెవెల్ ఆఫీసర్ ఆధ్వర్యంలో జరగాల్సి ఉందని, వాలంటీర్లు సూచించిన విధంగా తొలగిస్తున్నారన్నారు. వైసిపికి అనుకూలంగా ఉండేవారికి దొంగ ఓట్లు భారీగా నమోదు చేస్తున్నారన్నారు.గుంటూరు పశ్చిమ నియోజకవర్గం శ్యామలానగర్ 38వ నెంబర్ బూతులో ఒకే డోర్ నెంబర్ పై 800 ఓట్లు ఉన్నాయని, ఇది ఎలా సాధ్యపడిందో చెప్పాల్సి ఉందన్నారు.ఒక కాలేజీ డోర్ నెంబర్ మీద 46 ఓట్లు ఉన్నాయని, ఒక్క బూతులోనే సుమారు 800 దొంగ ఓట్లు నమోదు అయ్యాయంటే, రాష్ట్ర వ్యాప్తంగా ఎన్ని దొంగ ఓట్లు నమోదయ్యాయో ఊహించుకోవాలన్నారు. 2023 జనవరి 5వ తేదీన ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా విడుదల చేసిన జాబితా ప్రకారం సుమారు పది లక్షల ఓట్లను తొలగించారన్నారు. ఒక్క నర్సీపట్నం నియోజక వర్గంలోనే సుమారు17 వేల ఫేక్, డెత్, ఓట్లను గుర్తించి, వాటిని పరిశీలించి తొలగించాలని ఆర్డీఓ కు పిర్యాదు చేసినా కేవలం వాటిలో 2443 ఓట్లు మాత్రమే తొలగించారన్నారు.


ఫిర్యాదు చేస్తున్న నేతలు

బైకుల చోరీపై ఫిర్యాదు

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలో పలుచోట్ల వరస బైకుల చోరీపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించాలని జర్నలిస్ట్ సంఘం నేతలు, రాజకీయ పార్టీ నాయకులు కోరారు. శనివారం స్థానిక పోలీస్ స్టేషన్ లో ఎస్ఐ శిరీష ను కలిసి మాట్లాడారు. మండలంలో సుమారు 14 బైకులు, రెండు ఆటోలను దొంగలు దొంగలించారన్నారు. నక్కపల్లి లో ఉపమాక ఆర్చి జంక్షన్ సమీపంలో ఇటీవల ఓ జర్నలిస్ట్ బైక్‌ను అపహరించారన్నారు. దొంగలిం చిన బైకులను గుర్తించి సంబంధిత వాహన దారులకు అప్పగించే విధంగా చర్యలు చేపట్టాలని ఎస్ఐను కోరారు.

కోదండరామస్వామి కల్యాణం

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని జానకి రాంపురం గ్రామంలో శనివారం కోదండ రామస్వామి ద్వితీయ వార్షిక కల్యాణ మహోత్సవం కన్నుల పండుగగా నిర్వహించారు. దంపతులు కల్యాణాన్ని జరిపించారు. ఆలయ ప్రాంగణంలో అన్న సమారాధన నిర్వహించారు.

అక్రమంగా కలపను భద్రపరిస్తే చర్యలు

డిఎఫ్ఒ రాజారావు

ప్రజాశక్తి-కొత్తకోట:రావికమతం మండలం కొత్తకోట గ్రామంలోని మణికంఠ షామిల్లులో డిఎఫ్‌వో రాజారావు బృందం శనివారం దాడులు చేశారు. ఆ షామిల్లులో అనుమతులు లేకుండా కలపను భారీ ఎత్తున నిల్వ చేస్తున్నట్టు ముందస్తు సమాచారం అందడంతో డిఎఫ్ఓ రాజారావు సిబ్బందితో ఆ షామిల్లులో తనిఖీలు నిర్వహించారు. సుమారు రూ.25 వేల విలువ గల టేకు, గన్నెర, పాసి కలప ఉన్నట్టు గుర్తించారు. ఆ కలపను స్వాదీనం చేసుకున్నారు. షామిల్లు యజమాని పై కేసు నమోదు చేసినట్టు డిఎఫ్ఓ రాజారావు ఒక ప్రకటనలో తెలిపారు. షామిల్లులలో అనుమతులు లేని కలపను నిల్వ చేయడంతో పాటు కటింగ్ చేయడం నేరమేనని అటువంటి వాటిపై చర్యలు. తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మేడి వాడ సెక్షన్ ఆటవీ సెక్షన్ అధికారి నూకరాజు, గార్డు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

గొలుగొండ:గొలుగొండ మండలంలో టేకు పట్టా పర్మిట్లలో ఎటువంటి అవకతవకలు జరగలేదని నర్సీపట్నం డిఎఫ్ఒ బి.రాజారావు పేర్కొన్నారు. పట్టా కర్రల తరలింపులో ఆవకతవకలు జరిగాయంటూ ఈ ప్రాంతం నుంచి అందిన ఫిర్యాదుల మేరకు శనివారం స్థానిక విలేకరుల సమక్షంలో విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా డిఎఫ్ఒ మాట్లాడుతూ, మండలంలో పలుచోట్ల కలప వ్యాపారులు టేకు చెట్ల తరలింపునకు చేసుకున్న దరఖాస్తు మేరకు అనుమతులు మంజూరు చేయడం జరిగిందన్నారు. పట్టా రైతులు నరికిన కర్రలను వాటి మొదలు క్షుణ్ణంగా పరిశీలించడం జరిగిందన్నారు. ఈ మేరకు తాము ఇచ్చిన అనుమతులు మేరకే పట్టాదారులు టేకు చెట్లను నరికారని ఆయనన్నారు. తమ అనుమతితో తరలించేందుకు సిద్ధంగా ఉంచిన టేకు కర్రలను కొలతలు సరిగా ఉన్నది లేనిది పరిశీలించామన్నారు. తాము అనుమతులు ఇచ్చిన చోట చెట్లను నరికారా లేదా అనేది కూడా పరిశీలించామన్నారు. ఈ మేరకు ఇక్కడ ఎటువంటి అవకతవకులు జరగలేదని నిర్ధారణ అయ్యిందని డిఎఫ్ఓ రాజారావు తెలిపారు. డిఎఫ్ఓ వెంట రేంజర్ వెంకటరావు డిఆర్ఓ రాజేష్ గొలుగొండ సెక్షన్ అధికారి లక్ష్మణ్‌తో పాటు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.


గొలుగొండలో తనిఖీ చేస్తున్న డిఎఫ్ఒ

నగదు మాయంపై కేసు

ప్రజాశక్తి-కొత్తకోట:ఆటో ప్రయాణికురాలి నగదు మాయంపై కేసు నమోదు చేసినట్టు కొత్తకోట ఎస్సై విభూషణరావు చెప్పారు. శనివారం సాయంత్రం ఆయన తెలిపిన కథనం మేరకు...రోలుగుంట మండలం గుండుబాడు శివారు కసిరెడ్డి పాలెం గ్రామానికి చెందిన సింబోయిన వరహాలమ్మ జె. నాయుడుపాలెం గ్రామంలో మరో మహిళ తో కలసి కొత్తకోట వచ్చేందుకు ఆటో ఎక్కిందన్నారు. ఆటోలో అప్పటికే మరో గుర్తు తెలియని ముగ్గురు మహిళలు ఉన్నారన్నారు. బాధిత వరహాలమ్మ కొత్తకోట చేరుకొని ఆసుపత్రికి వెళ్లి గంట తర్వాత స్థానిక బ్యాంకులో నగదు జమ చేసేందుకు బ్యాంకు వద్ద బ్యాగ్‌ను చూసుకోగా సుమారు రూ. 60 వేలు నగదుతో పాటు దుస్తుల బ్యాగ్ మాయం అయ్యిందని గుర్తించదని పేర్కొన్నారు. వరహాలమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి ఎస్సై తెలిపారు.

550వ రోజుకు మత్స్యకారుల ధర్నా

ప్రజాశక్తి-నక్కపల్లి:హెటిరో కొత్త పైపులైన్‌కు వ్యతిరేకంగా మత్స్యకారులు తలపెట్టిన శాంతియుత మహాధర్నా శనివారం నాటికి 550వ రోజుకు చేరింది. శిబిరం వద్ద మత్స్యకారులు పైపులైను వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎంఅప్పలరాజు మాట్లాడుతూ, మత్స్యకారులకు న్యాయం జరిగే వరకూ పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పైపులైన్ వేసుకోవడానికి ఇచ్చిన అనుమతులను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో నాయకులు పిక్కి కోదండ, గోసల సోమేశ్వరరావు, చేపలు సోమేష్, అమ్మోరియ్య, బొంది శ్రీను, వాసుపిల్లి దేముడు, మైలపల్లి శివాజీ, మైలపల్లి బాపూజీ, గోసల వెంకటేష్, చోడిపల్లి రాజు పాల్గొన్నారు.


ధర్మశ్రీకి తిలకం దిద్దుతున్న మహిళలు

పార్టీలకతీతంగా పథకాలు

ప్రజాశక్తి-రోలుగుంట:అర్హులైన వారందరికి సంక్షేమ పథకాలు అందిస్తున్నామని ప్రభుత్వ విప్, చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ అన్నారు. శనివారం రోలుగుంట మండలం రొంగలిపాలెం గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మశ్రీ మాట్లాడుతూ, అర్హతే ప్రామాణికంగా రాజకీయాలు, పార్టీలు చూడకుండా సంక్షేమ పథకా లను అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి యర్రంశెట్టి శ్రీనివాసరావు, అధికారులు పాల్గొన్నారు.

16 నుంచి కాంటెక్ ఎక్స్‌పో

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా విశాఖపట్నం సెంటర్ ఆధ్వర్యంలో ఈ నెల 16, 17, 18 తేదీలలో కాంటెక్ ఎక్స్‌పో - 2023 పేరుతో గృహ నిర్మాణానికి అవసరమైన ముడి పదార్థాల ప్రదర్శన నిర్వహిస్తున్నామని బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా విశాఖపట్నం సెంటర్ చైర్మన్ కె.వెంకటేశ్వర్లు తెలిపారు. శనివారం ఉదయం సిరిపురంలోని బిల్డర్స్ అసోసియేషన్ అఫ్ ఇండియా కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఈ ఎక్స్‌పోకు సంబంధించిన వివరాలను ఆయన వెల్లడించారు. ఈ నెల 16 ఉదయం 10:30 గంటలకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ చేతుల మీదుగా ఈ ఎక్స్‌పో ప్రారంభమవుతుందని అన్నారు. మూడు రోజులపాటు జరిగే ఈ ఎక్స్‌పో ఉదయం 10:30 నుంచి సాయంత్రం 7 గంటల వరకు ఎంవిపి కాలనీలోని గాది రాజు ప్యాలెస్‌లో ఉంటుందని అన్నారు. కరోనా తరువాత నిర్మాణ రంగంలో ఎన్నో మార్పులు వచ్చాయని, ఈ మార్పులకు అనుగుణంగా నూతన టెక్నాలజీని బిల్డర్లకు, యజమానులకు పరిచయం చేసే సదుద్దేశంతో, సేవా దృక్పథంతో ఈ ఎక్స్‌పో నిర్వహిస్తున్నామని తెలిపారు. సుమారు 50 కంపెనీలకు చెందిన ప్రతినిధులు తమ ఉత్పత్తులను, ఐరన్, స్టీల్, కాంక్రీట్, సిమెంట్, ఇంటీరియర్, ఎలక్ట్రికల్ వంటి గృహ నిర్మాణ వస్తువులను ప్రదర్శిస్తారని అన్నారు. ప్రజలంతా ఈ ప్రదర్శనకు విచ్చేసి నిర్మాణ రంగంలోని నూతన టెక్నాలజీని తెలుసుకొని తద్వారా నిర్మాణ రంగంలో ముందుకు సాగాలని కోరారు. ఎక్స్‌పో ప్రారంభోత్సవానికి ఎంపీ ఎంవివి.సత్యనారాయణ, తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు గౌరవ అతిథులుగా హాజరవుతారని తెలిపారు. ఈ మీడియా సమావేశంలో బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా మాజీ జాతీయ ఉపాధ్యక్షులు సిహెచ్.రామకోటయ్య, గత చైర్మన్ ఎ.కాశీ విశ్వేశ్వరరావు, కోశాధికారి జివి.రవిరాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ప్రతినిధులు